ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
బుధవారం 21 మే 2025





ఆందోళన చేస్తున్న తోటకూరపాలెం గ్రామస్థులు

నష్టపరిహారంపై తేల్చండి

ప్రత్యామ్నాయ జీవనోపాధిపై స్పష్టమైన హామీ ఇవ్వండి

- ఆ తరువాతే గ్రామంలోకి అడుగు పెట్టండి
- సుజల స్రవంతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ సర్వేకు వచ్చిన అధికారులకు తేల్చి చెప్పిన తోటకూరపాలెం గ్రామస్థులు

రావికమతం, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ జీవనోపాధితో పాటు నష్టపరిహారం ఎంత ఇస్తారో ముందుగా ప్రకటించిన తరువాతే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ సర్వే చేపట్టాలని, అప్పటి వరకు ఏ అధికారి గ్రామంలోకి అడుగు పెట్టవద్దని మండలంలోని తోటకూరపాలెం గ్రామస్థులు రావికమతం తహసీల్దార్ బి.వెంకటరమణకు తేల్చి చెప్పారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో భాగంగా బుచ్చియ్యపేట మండలం పెదపూడి, పంగిడి, రావికమతం మండలంలోని తోటకూరపాలెం గ్రామాల రెవెన్యూ పరిధిలో సుమారు 11 వందల ఎకరాలలో పెదపూడిని ఆనుకొని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించి ఉత్తరాంధ్ర జిల్లాలకు సాగు, తాగు నీరు అందించాలన్నది లక్ష్యం. అప్పట్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. అప్పట్లోనూ రైతులు అభ్యంతరం తెలిపారు. ఈలోగా ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పనుల ఊసే ఎత్తకుండా గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కలెక్టర్ ఆదేశాల మేరకు రావికమతం తహసీల్దార్ బి.వెంకటరమణ సర్వే సిబ్బంది, పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం కూడా తోటకూరపాలెం వెళ్లారు. దీంతో గ్రామస్థులు, రైతులు భారీగా తరలి వచ్చి తహసీల్దార్ ఎదుట ఆందోళన చేశారు. భూములు కోల్పోయిన రైతులకు ఏ విధమైన న్యాయం చేస్తారో కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ఇతర అధికారులు గ్రామానికి వచ్చి ప్రజా వేదికలో బహిరంగ హామీ ఇవ్వాలని, వారు ఇచ్చే భరోసాను బట్టి రైతులకు సమ్మతమైతేనే సర్వే చేయడానికి అంగీకరిస్తామని చెప్పారు. డీపీఆర్ ఏ విధంగా ఉందో బహిరంగంగా చూపాలని, ఎంత భూములను తీసుకుంటున్నారో తెలపాలని డిమాండ్ చేశారు. గతంలోనే తమ గ్రామానికి ఏ విధమైన ముప్పు లేకుండా డీపీఆర్ రూపొందిస్తామని చెప్పారని, ఆ విధంగానే ఇప్పుడు జరుగుతుందా? అనేది గ్రామంలో ప్రజా వేదిక ద్వారా బహిరంగంగా తెలియజేయాలని కోరారు. ఎవరు బడితే వారు తరచూ గ్రామానికి వచ్చి ఇష్టానుసారంగా సర్వేలు చేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. దీని వలన తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామని ఎంపీపీ పైల రాజు, బోని సింహాచలం నాయుడు, పైల సూరిబాబు, రుత్తల రాము, ఎడ్ల సత్తిబాబు, చింతి అచ్చిబాబు, రైతులు చెప్పారు. తమకు జీవనాధారమైన భూములను లాక్కుంటే తమ పరిస్థితి ఏమిటని నిలదీశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది ముందుగా ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డలు, వాగులను గుర్తిస్తారన్నారు. ఈ సర్వే వలన రైతులకు ఎలాంటి నష్టం గాని, భూములను బలవంతంగా లాక్కోవడం గాని ... మిగతా 8వ పేజీలో

31న సీఎం చంద్రబాబు పాడేరు రాక



- సామాజిక పెన్షన్ల పంపిణీలో పాల్గొనే అవకాశం

పాడేరు, మే 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 31న అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు రానున్నారు. జూన్ నెల సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియను ఆయన ఇక్కడే లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిసింది. అలాగే పాడేరులో గిరిజనులతో బహిరంగ సభ నిర్వహించి లక్ష ఎకరాల్లో కాఫీ తోటల అభివృద్ధి, జీవో:3కి ప్రత్యామ్నాయ జీవో పైనా సీఎం చంద్రబాబునాయుడు ప్రకటన చేస్తారని తెలుస్తున్నది. అయితే సీఎం పర్యటనపై అధికారులు అధికారికంగా వెల్లడించలేదు.

ఘనంగా తిరంగా ర్యాలీ

ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఎలమంచిలి పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. గురవప్ప కల్యాణ మండపం నుంచి ఎల్‌బీసీ రోడ్డు మీదుగా దిమిలి రోడ్డు జంక్షన్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- వార్త 8వ పేజీలో..



ఎలమంచిలిలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నేతలు పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు, తదితరులు

ఖరీఫ్ సాగుకు ప్రణాళిక

జిల్లాలో 1.87 లక్షల ఎకరాల్లో సాగు

- 24,112 క్వింటాళ్ల విత్తనాలు అవసరం
- వ్యవసాయ శాఖ అంచనా

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యవసాయశాఖ ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేసింది. విత్తనాల నుంచి ఎరువుల వరకు ఎంత మేరకు అవసరమనే దానిపై అధికారులు అంచనాలు వేశారు. గత వైసీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. కేవలం పెట్టుబడి నిధి విడుదల చేసి చేతులు దులుపుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రణాళికతో ముందుకు వెళుతోంది. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరంలో ప్రధాన పంటలైన వరి, అపరాలు, నువ్వుల సాగు విస్తీర్ణం పెంచడమే కాకుండా పంట దిగుబడులు పెంచేందుకు ప్రణాళికతో అడుగులు వేస్తోంది.

ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా అడపా దడపా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పంటల సాగుకు కొంత వరకు మేలు చేస్తాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు మండలాల్లో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. కొన్ని చోట్ల దుక్కులు మొదలు పెట్టారు. జిల్లాలో 24 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1.87 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రధాన పంటలైన వరి, అపరాలు, నువ్వుల సాగు విస్తీర్ణంతో పాటు దిగుబడులను పెంచాలని నియోజకవర్గాల వారీగా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో 1.45 లక్షల ఎకరాల్లో వరి, 35 వేల ఎకరాల్లో చిరు ధాన్యాలు, 6,732 ఎకరాల్లో నువ్వులు సాగు చేపట్టనున్నట్టు అధికారులు ప్రాథమిక అంచనా నివేదికలు తయారు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే వివిధ రకాల పంటలకు 24,112 క్వింటాళ్ల విత్తనాలు రాయితీపై అందించనున్నారు. పచ్చిరొట్ట విత్తనాలు 893 క్వింటాళ్లు, వరి విత్తనాలు 23,109 క్వింటాళ్లు, రాగులు 2 క్వింటాళ్లు, అపరాలు 84 క్వింటాళ్లు, నువ్వులు 20 క్వింటాళ్లు, చిరు ధాన్యాలు 4 క్వింటాళ్లు సరఫరా చేసేందుకు ఇండెంట్ పెట్టారు.



చోడవరం మండలం జి.జగన్నాథపురంలో వ్యవసాయ పనుల్లో రైతులు (ఫైల్)

రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు

ఎరువుల వినియోగం తగ్గించి, భూసారాన్ని పెంచేందుకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ న్యూట్రిషన్ మిషన్ గ్రామ విత్తనాభివృద్ధి పథకం కింద ఎనిమిదేళ్ల లోపు వరి విత్తనాలను 305 ఎకరాల్లో అభివృద్ధి చేసేందుకు వివిధ పరిశోధన కేంద్రాల నుంచి విత్తనాలు సేకరించి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంటీయూ 1224, ఎంటీయూ 1262, ఎంటీయూ 1318, బీపీటీ 2856 రకం వరి విత్తనాలు 50 శాతం రాయితీపై లేదా క్వింటాకు రూ.2,200 కు సరఫరా చేయనున్నారు. ఖరీఫ్ పంటల సాగు చేపట్టిన రైతుల కోసం 35,353 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. ఖరీఫ్ సాగు చేపట్టే రైతులకు జిల్లాలో అన్ని మండలాల్లో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండి, సూచనలు, సలహాలు అందిస్తారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు.



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

జిల్లాలో మోస్తరు వర్షం

- రాగల మూడు రోజుల్లో విస్తారంగా కురిసే అవకాశం

అనకాపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్): జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం వరకు వాతావరణం చల్లబడి, అక్కడక్కడా తేలిక పాటి జల్లులు కురిశాయి. రాగల మూడు రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలో మొత్తం వర్షపాతం 313.6 మిల్లీమీటర్లు వర్షం కురవగా, సగటు వర్షపాతం 13.1 మిల్లీ మీటర్లు నమోదైంది. మండలాల వారీగా చూస్తే అత్యధికంగా అచ్యుతాపురం మండలంలో 55.8 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా నాతవరం మండలంలో 2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గొలుగొండ మండలంలో వర్షం కురవలేదు. రాంబిల్లి మండలంలో 45.2 మిల్లీ మీటర్లు, ఎలమంచిలిలో 30, చీడికాడలో 21.4, నక్కపల్లిలో 19.8, అనకాపల్లిలో 16.6, పరవాడలో 15.4, ఎస్.రాయవరంలో 15.2, పాయకరావుపేటలో 14.2, సబ్బవరంలో 11.8, మాడుగులలో 10.4, మునగపాకలో 6.8, చోడవరంలో 6.4, బుచ్చెయ్యపేటలో 6.2, దేవరాపల్లిలో 5.8, మాకవరపాలెంలో 5.6, రావికమతంలో 5.4, కె.కోటపాడులో 5.4, కోటవురట్లలో 4.6, రోలుగుంటలో 3.8, కశింకోటలో 3.6, నర్సీపట్నంలో 2.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మండలాల్లో తేలిక పాటి వర్షపు జల్లులు కురిశాయి.

ఆహార భద్రతకు తూట్లు

- హోటళ్లలో విచ్చలవిడిగా రంగులు, టేస్టింగ్ సాల్ట్ వాడకం
- నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు

నర్సీపట్నం, మే 20(ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని పలు హోటళ్లు ఆహార భద్రతను గాలికొదిలేశాయన్న ఆరోపణలు ఉన్నాయి. రుచి కోసం ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, టేస్టింగ్ సాల్ట్‌లు వినియోగిస్తున్నట్టు ఆహార తనిఖీ అధికారులు గుర్తించారు. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 39 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో ప్రభుత్వ అనుమతులతో పెద్ద హోటళ్లు 200, 50 రెస్టారెంట్లు ఉన్నాయి. వెయ్యికి పైగా చిన్న హోటల్స్ ఉన్నాయి. అనధికార మాంసాహార హోటళ్లు, తోపుడు బండ్లు అయితే వేల సంఖ్యలో ఉంటాయి. సిబ్బంది కొరత, పని చేయాల్సిన పరిధి ఎక్కువగా ఉండడంతో ఆహార తనిఖీ అధికారులు నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి.

మరిగిన నూనె పలుమార్లు వాడకం

చిన్న చిన్న హోటళ్లు, తోపుడు బండ్ల వద్ద మిరపకాయ బజ్జీలు వేపిన నూనెలో పకోడీలు, తర్వాత బోండాలు, అరటికాయ బజ్జీలు.. ఈ విధంగా రోజంతా నూనె మరిగి మరిగి తారులా తయారవుతోంది. ఆ నూనె మిగిలితే మరుసటి రోజు ఉదయం పూరీలు, దోసలు, పెసరట్లు తయారీలో వాడుతున్నారు. దీని వలన జీర్ణకోశ, లివర్ సంబంధిత ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు అధికంగా ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు.



నర్సీపట్నంలోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ (ఫైల్)

రంగులు, టేస్టింగ్ సాల్ట్ వినియోగంతో ప్రమాదం

హోటళ్లు, రెస్టారెంట్లలో మాంసం, చేపల ఫ్రై, గ్రేవీ, బిర్యానీ నిగనిగలాడుతూ కనిపించడానికి ప్రమాదకరమైన రంగులు అధికంగా వాడుతున్నట్టు అధికారులు గుర్తించారు. రుచి కోసం హోటళ్ల నిర్వాహకులు టేస్టింగ్ సాల్ట్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లు, తోపుడు బళ్లు, బేకరీలలో వంటశాలలు అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. రాత్రి మిగిలిన ఆహార పదార్థాలు మరుసటి రోజు వేడి చేసి ... మిగతా 8వ పేజీలో

డిప్యూటీ మేయర్‌గా గోవిందరాజు ఏకగ్రీవం



దల్లి గోవిందరాజు

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా జనసేనకు చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు ఎన్నికయ్యారు. కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జియ్యాని శ్రీధర్ డిప్యూటీ మేయర్ పదవిని కోల్పోయారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కొత్త డిప్యూటీ మేయర్ ఎన్నిక నిమిత్తం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయగా, కోరం లేక మంగళవారానికి వాయిదాపడిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎన్నికల అధికారి హోదాలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కౌన్సిల్ హాల్‌కు చేరుకున్నారు. ఎన్నిక నిర్వహించడానికి 56 మంది సభ్యులు అవసరమని, హాజరైనవారి సంఖ్యను లెక్కించాలని రో అధికారులను ఆదేశించారు. ఏడుగురు ఎమ్మెల్యేలు, 52 మంది కార్పొరేటర్లు అప్పటికి హాజరైనట్టు అధికారులు నివేదించడంతో సమావేశాన్ని ... మిగతా 8వ పేజీలో

రామజోగయ్యశాస్త్రికి సిరివెన్నెల స్మారక పురస్కారం



సిరివెన్నెల సీతారామశాస్త్రి స్మారక పురస్కారంతో రామజోగయ్యశాస్త్రిని సత్కరిస్తున్న దృశ్యం

-8లో

అపార్ట్‌మెంట్లలో ఆకస్మిక తనిఖీలు

- అచ్యుతాపురంలో పోలీసుల అదుపులో పలువురు యువకులు

... వార్త మెయిన్ ఎడిషన్‌లో..

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

సిగ్నల్ ఇవ్వకుండా మలుపు తిరుగుతున్న లారీని ఢీకొన్న కారు

- వివాహానికి నరసాపురం వెళుతుండగా ఘటన
- ఇద్దరికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో మృతురాలు వెంకట నరసమ్మ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు ముందుభాగం

కశింకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం కారులో నరసాపురం వెళుతుండగా ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా లారీ మలుపు తిప్పడంతో దానిని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పశ్చిమ గోదావరి నరసాపురం చవలపేట ప్రాంతానికి చెందిన బుంగా వెంకట నరసమ్మ(72) విశాఖలో కుమారుడు నరేశ్ వద్ద ఉంటోంది. స్వగ్రామంలో బంధువుల వివాహం ఉండడంతో కుమారుడు నరేశ్, మనుమరాళ్లు బి.కీర్తన, పి.సువర్ణ, పి.సంకీర్తనతో కలిసి ఆమె కారులో మంగళవారం వేకువజామున విశాఖ నుంచి బయలుదేరింది. తెల్లవారుజాము 4.48 గంటలకు బయ్యవరం వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా మలుపు తిప్పడంతో దానిని కారు బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జు కాగా, వెంకట నరసమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు ... మిగతా 8వ పేజీలో

జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు

» కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే విజయకుమార్


ఎమ్మెల్యే సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

అచ్యుతాపురం రూరల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిల్లోడుపాలెం, జేపీ అగ్రహారం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు పి.శివఅప్పారావు, అప్పలరాజు, బి.రాజు, రాజేష్, నవీన్, కోటేశ్వరరావు, సురేష్, రాము, అప్పారావులతో పాటు మరికొంత మంది ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో మంగళవారం జనసేన పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే తన స్వగృహం వద్ద కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. ఇప్పటికే అనేకచోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మోటూరి త్రివేణి, పార్టీ అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షుడు బైలపూడి శ్రీరామదాసు, నాయకులు కె.చిన్నారావు, ద్వారపురెడ్డి బాబ్జి, కరెడ్ల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక : ఇక్కడి సంతబయలులో ఈ నెల 22న హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే విజయకుమార్ మంగళవారం ఇక్కడి జనసేన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. వేడుకలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. సంతబయలు అభయాంజనేయ ఆలయ నిర్వాహకుడు మణికంఠ మాట్లాడుతూ హనుమజ్జయంతితో పాటు, జూన్ 18న ఆలయ వార్షికోత్సవాన్ని జరపనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, కూటమి నాయకులు దాడి ముసిలినాయుడు, దొడ్డి శ్రీనివాసరావు, ఆడారి శ్రీకాంత్, ఆడారి గోవింద తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు అధికారులతో రోడ్డు విస్తరణపై ఏకాంతంగా సమావేశం నిర్వహించారు.

లోవపాలేన్ని బలవంతంగా తరలిస్తే ఊరుకోం

» సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం


లోవపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న లోకనాథం

రాంబిల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జడ్.చింతువా పంచాయతీ లోవపాలెంలో మంగళవారం సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈజడ్‌లోకి లోవపాలెం గ్రామాన్ని తీసుకుంటున్నారని, అధికారులు తమ ఇళ్లకు వచ్చి నంబర్లు వేస్తున్నారని చెప్పారు. గ్రామాన్ని ఎక్కడికి తరలిస్తారో, ప్యాకేజీ ఎంత ఇస్తారో, ఎటువంటి ఉపాధి కల్పిస్తారో వంటి వివరాలు ఏవీ చెప్పడం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం వీరికి నష్టపరిహారం, నివాసాలకు ఉపయోగకరంగా ఉన్న ఆర్అండ్ఆర్ కాలనీ, మేజర్ కుమారులు, కుమార్తెలకు ఐదు సెంట్ల ఇళ్ల స్థలంతో పాటు నష్టపరిహారం ఇవ్వాలని, గ్రామంలోని యువతీ యువకులకు కంపెనీలో ఉపాధి కల్పించాలని కోరారు. గ్రామస్థులను బలవంతంగా తరలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.శంకరరావు, రాంబిల్లి మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, కమిటీ సభ్యులు వై.రాము పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా పాలన

» మినీ మహానాడులో రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ 'ప్రగడ' వెల్లడి » సమష్టిగా పార్టీని మరింత బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు పిలుపు » 16 అంశాలపై తీర్మానం



మినీ మహానాడుకు హాజరైన టీడీపీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు తదితరులు

ఎలమంచిలి, మే 20 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమంతో పాటు రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలవాలన్న లక్ష్యంతో ప్రభుత్వ పాలన సాగుతోందని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పట్టణంలోని గురవప్ప కల్యాణ మండపంలో మంగళవారం మినీ మహానాడును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు ప్రధాని మోదీ ప్రోత్సాహంతో జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా సీఎం చంద్రబాబు ఎన్నెన్నో అద్భుత పథకాలకు రూపకల్పన చేస్తున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ క్రమశిక్షణకు టీడీపీ కార్యకర్తలు మారుపేరుగా పేర్కొన్నారు. నియోజకవర్గంలో సమష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో అధిష్ఠానం నిర్ణయం మేరకు కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ప్రతినిధులను ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీకి నిస్వార్థపరులైన నాయకగణం ఉందని, కార్యకర్తలంతా వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. అనంతరం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేశ్‌లు నియోజకవర్గంలో సమస్యలను అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేద్దామని చెప్పారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో కొంతమంది అధికారులు టీడీపీ నేతలను, కార్యకర్తలను ప్రతిపక్షం కంటే దారుణంగా విలువ లేకుండా చూస్తున్నారని వాపోయారు. రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉన్నా టీడీపీ శ్రేణులకు సరైన గుర్తింపు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పదహారు అంశాలపై తీర్మానం చేయగా, అంతా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డెరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డెక్కా నాగభూషణం, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, పార్టీ నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గెంజి శ్రీను, పెంటకోట విజయ్, పీలా తులసీరామ్, రాష్ట్ర, జిల్లా నాయకులు ఆడారి మంజు, రాజాన నారాయణమ్మ, కొఠారు సాంబ, కొలుకులూరి విజయ్‌బాబు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, రాజాన వెంకునాయుడు, బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవి, ఆడారి రమణబాబులతో పాటు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తీర్మానాల్లో కొన్ని అంశాలు

నియోజకవర్గంలో గుర్తింపులేని లే అవుట్లు, 22 ఏ భూములు, భూ కబ్జాలు, గత ప్రభుత్వంలో నాయకులు కుంభకోణానికి పాల్పడిన అంశాలపై సమగ్రమైన దర్యాప్తు చేయాలని, ఈ ప్రాంత పరిశ్రమల్లో పెద్ద వర్కులు, కోల్, డాక్ , లోకల్ ట్రాన్స్‌పోర్టు, ట్రావెల్స్ ఇతర పనులన్నీ వైసీపీ నేతల నాయకత్వంలోనే బినామీల పేరిట కొనసాగుతున్నందున వాటిని రద్దు చేసి విచారణ జరపాలని, ఎక్కడా లేని విధంగా టీడీపీ కార్యకర్తలపై పోలీసు కేసులు నియోజకవర్గంలోనే ఎక్కువగా ఉన్నాయని వీటి నిగ్గు తేల్చాలని, ఎలమంచిలి మునిసిపాలిటీలో పేద కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, తాగునీరు, డ్రైనేజీ, రహదారుల సమస్య పరిష్కరించాలని తదితర అంశాలపై అంతా తీర్మానం చేసి అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్లాలని నిర్ణయించారు.

మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

ఎలమంచిలి, మే 20 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ కాంట్రాక్టు కార్మికులు మంగళవారం గ్యారేజ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, కేంద్రం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వై.నూకరాజు, సీహెచ్.వెంకటరమణ, జె.వెంకటరమణ, వై.దుర్గారావు, వై.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంగాలమ్మ, చిట్టి పైడితల్లమ్మ జాతర

ఎలమంచిలి, మే 20 (ఆంధ్రజ్యోతి) : పులపర్తిలో మంగళవారం గంగాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారికి విశేష అలంకరణలు, పూజలు జరిపిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది.

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని దుప్పితూరులో కొలువుదీరిన చిట్టి పైడితల్లమ్మ జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుక సందర్భంగా ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. రాత్రికి ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నాయకులు శెట్టి చిరంజీవి, దేశంశెట్టి ఎల్లయ్యనాయుడు, శంకరరావు, శెట్టి నాగేశ్వరరావు, ప్రగడ తాతబాబు, ప్రకాశ్ పాల్గొన్నారు.


దుప్పితూరులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కార్మికవర్గం నిరసన స్వరం


ఎలమంచిలి నెహ్రూనగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పణ

ఎలమంచిలి, మే 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేయదలచిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇక్కడ సీఐటీయూ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నెహ్రూనగర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ మండల కార్యదర్శి సిహెచ్.శివాజీ మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం తుంగలోకి తొక్కేలా ప్రయత్నాలు చేస్తుండడం తగదన్నారు. వెంటనే రద్దు చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు జానకి, వరలక్ష్మి, కొండయ్య, జ్యోతి, మణి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం రూరల్ : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. జూలై తొమ్మిదో తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అచ్యుతాపురం జంక్షన్‌లో కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అంతా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ నాయకులు కర్రి నాయుడు, తట్టా రాజు, ముఠా, ఎస్ఈజడ్ కార్మికులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో...

రాంబిల్లి : కేంద్ర ప్రభుత్వం తీసుకు రానున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రం రాంబిల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, రైతులు పండిచే పంటలకు మద్దతు ధర ఇవ్వాలని ఆటో, ముఠా, బిల్డింగ్, మోటార్ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని, ఉపాధి హామీ పథకాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో, ముఠా ట్రాన్స్‌పోర్టు, ఎన్ఏటీబీ నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



మునగపాక తహసీల్దార్ కార్యాలయం వద్ద స్కీమ్ వర్కర్ల ధర్నా

మునగపాకలో..

మునగపాక : ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం తదితర రంగాల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం స్కీమ్ వర్కర్లు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు రూ.16వేలు చొప్పున వేతనాలు ఇవ్వాలని, వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరపు పార్వతి, సంజీవరావు, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

'పేటలో' త్వరలో అన్న క్యాంటీన్


అన్న క్యాంటీన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

పాయకరావుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు త్వరలో తిరిగి ప్రారంభించనున్నట్టు పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ డీఈఈ కె.జానకి తెలిపారు. మంగళవారం పాయకరావుపేట వచ్చిన ఆమె టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబుతో కలిసి స్థానిక అరటిగెలల మార్కెట్‌లో గతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో పిల్లర్ల వరకు జరిగిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు అన్నా క్యాంటీన్ ఏర్పాటుకోసం ఈ స్థలం పరిశీలించినట్టు చెప్పారు. సుమారు రూ.41 లక్షలతో అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని ఆమె తెలిపారు. ఏఈఈ నరసింహారెడ్డితో పాటు టీడీపీ నాయకులు యాళ్ల వరహాలబాబు, గూటూరు శ్రీనివాసరావు, చింతకాయల రాం బాబు, వేములపూడి అప్పారావు, రాజాన ఆది పాల్గొన్నారు.

జూనియర్ ఎన్‌టీఆర్ అభిమానుల రక్తదానం


రక్తదానం చేసిన అభిమానులకు ధ్రువపత్రాలందిస్తున్న దృశ్యం

ఎస్. రాయవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో జూనియర్ ఎన్ టీఆర్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని మండలంలోని రేవుపోలవరం గ్రామంలో మంగళవారం ఆయన అభిమానుల ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. లైఫ్ షేర్ బ్లడ్ గ్రూపు వారి సమక్షంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు అభిమానులు తరలి వచ్చి రక్తదానం చేశారు. వీరికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్‌అభిమానులు పల్లేటి దాసు, బత్తిన జగదీశ్, చోడపల్లి లోవరాజు కంబాల రాజు, జగదీశ్, అమ్మరయ్య, అప్పలరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలి

» కారిడార్ నిర్వాసిత గ్రామాల రైతులు డిమాండ్

నక్కపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): పభుత్వం ప్రకటించిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తమకు ఆమోదయోగ్యంగా లేదని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని పలు గ్రామాల నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని రాజయ్యపేట, వేంపాడు, చందనాడ, బుచ్చిరాజుపేట, డీఎల్‌పురం గ్రామాల్లో మంగళవారం కారిడార్ నిర్వాసిత రైతుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయమై ఆర్డీవో వీవీవీ రమణ గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల వారీగా ఈ ప్యాకేజీకి ఎంత మంది లబ్ధిదారులు అర్హులో వివరాలతో కూడిన జాబితాలను ఆర్డీవో ప్రకటించారు. ఏమైనా సందేహాలు, అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ గ్రామసభల్లో తహసీల్దార్ నర్సింహమూర్తి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వీవీవీ రమణ

'మినీ మహానాడును విజయవంతం చేయాలి'


మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు లింగంనాయుడు

కోటవురట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎస్. రాయవరం మండలం అడ్డురోడ్డులో ఈ నెల 22వ తేదీన జరగనున్న మినీ మహానాడును కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ స్థాయి ఈ మినీ మహానాడు కార్యక్రమానికి మండలం నుంచి 2వేల మంది కార్యకర్తలను తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధిఅవకాశాలు కల్పించేందుకు మండలంలో ఏదో పరిశ్రమ ఏర్పాటు, తాండవ శివారం భూములకు సాగునీటి కాలువలు అభివృద్ధికి మినీమహానాడులో ప్రస్తావించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, జానకీ శ్రీనివాసరావు, కాశీవిశ్వనాథం, వేచలపు జనార్దన్, నాయకుడు యలమంచిలి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డరోడ్డులో ఏర్పాట్లు

ఎస్. రాయవరం: అడ్డరోడ్డు సమీపంలో గురువారం నిర్వహించనున్న మినీ మహానాడు సభ ఏర్పాట్లను టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మినీ మహానాడుకు జిల్లా వ్యాప్తంగా సుమారు పది వేలమంది టీడీపీ శ్రేణులు తరలి వచ్చి హాజరుకానున్నారన్నారు.ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.


అడ్డరోడ్డు సమీపంలో మినీ మహానాడు సభకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

బాల్య వివాహాల నిరోధంపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి లోవరాజు

ఎస్. రాయవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): గ్రా మా ల్లో బాల్య వివాహల నివారణకు విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ కమిటీల ద్వారా ప్రత్యేక దృష్టి సారించినట్టు జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి డి. లోవరాజు అన్నారు. మండలంలోని గెడ్డపాలెంలో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో 11 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల కార్మికులతో పాటు బాల్య వివాహాలపై కమిటీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

వర్షంతో ఉపశమనం

పాయకరావుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఉపరిత ద్రోణి ప్రభావంతో పాయకరావుపేటలో మంగళవారం ఒక మోస్తరు వర్షం పడింది. మంగళవారం తెల్లవారుజామున చిన్న చినుకులతో ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం వరకు అడపాతడపా వర్షం పడింది. అనంతరం సాయంత్రం వరకు మేఘాలు కమ్ముకున్నాయి. ఉక్క పోతకు గురైన ప్రజలు సేదతీరారు. ఈ వర్షానికి పట్టణం లోని మెయిన్‌రోడ్డులో లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. రోడ్డు మార్జిన్లు బురదమయం కావడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

కోటవురట్ల: మండలంలో పలుగ్రామాల్లో భారీవర్షం కురిసింది. సోమవారం అర్ధరాత్రినుంచి మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు ముసురు వాతావరణం నెలకొంది. ఉక్కపోతతో కొన్ని రోజులుగా అల్లాడుతున్న ప్రజలకు వర్షంతో వాతావరణం చల్లబ డటంతో ఉపశమనం పొందారు. కోటవురట్ల, కైలాసపట్నం రాజుపేట, చౌడువాడ. గొట్టివాడ, లింగాపురంగ్రామాల్లో భారీ వర్షం కురిసింది. రహదార్లు జలమయ్యాయి. డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం కొట్టుకుపోయింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంవద్ద వర్షపు నీరు నిలిచి వాహనాలు రాకపోకలకు తీవ్రఅంతరాయం నెలకొంది. ఈ వర్షం కూరగాయల పంటలకు మేలుచేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పరినారు మడులను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు.


పాయకరావుపేట: వర్షానికి శ్రీలక్ష్మి థియేటర్ సెంటర్‌లో చేరిన నీరు

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ దర్యాప్తు


డొంకాడలో దర్యాప్తు జరుపుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

నక్కపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంకాడ గ్రామంలో దళిత యువకులపై ఓ సామాజిక వర్గానికి చెందిన వారు దాడికి పాల్పడిన ఘటనపై నక్కపల్లి పోలీసులు సోమవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.ఈ నేపథ్యంలోమంగళవారం నర్సీపట్నం డీఎస్పీ పి.వెంకటేశ్వరరావు,సీఐ కె.కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబుగ్రామానికి వెళ్లి దాడి జరిగినప్రాంతాన్ని పరిశీలించారు. దాడికి గురైనబాధితులతో మాట్లాడారు. వారి నుంచి వివరాలు సేకరించారు. అలాగే ఎస్సీ కాలనీలో దళితులను సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, నాసా సంస్థ ప్రతినిధులు శ్రీను, శాంతి కుమారి తదితరులు పరామర్శించి సంఘీభావం ప్రకటించారు.

దళిత యువకులే దాడి చేశారంటూ ఫిర్యాదు

అలాగే, డొంకాడ ఎస్సీ కాలనీకి చెందిన నలుగురు దళిత యువకులపై , కాపు సామాజిక వర్గానికి చెందిన వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు మంగళవారం ఎస్ఐ సన్నిబాబు విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన జీని సత్యనారాయణ కుమారుడు లచ్చబాబు వివాహం సందర్భంగా 18న రిసెప్షన్ జరిగిందని, ఇందుకుగాను టెంట్లు, లైటింగ్ ఏర్పాటుకు వచ్చిన దళిత యువకులు గుమ్మడి పోతురాజు, అయినవెల్లి స్వర్ణరాజు, దయాసాగర్,వీధి కిశోర్ వచ్చి తమ కుమార్తె ఫోన్ దొంగలించారని సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలిసి ఫోన్ ఇవ్వాలని కోరగా తన కుమారుడితో పాటు, తనపై దాడి చేశారంటూ సత్యనారాయణ ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తాతయ్యబాబు, విజయ్

విజయవంతంగా మినీ మహానాడు

» ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తీర్మానం

నర్సీపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టార్ హోమ్స్‌లో మంగళవారం టీడీపీ మినీ మహానాడును విజయవంతంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబుతో కలిసి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని తీర్మానం చేశారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ మాట్లాడుతూ తెలుగుదేశం జెండా చూస్తూ పెరిగానని, చివరి శ్వాస వరకు ఆ పార్టీలోనే ఉంటామని స్పష్టం చేశారు. అయ్యన్నపాత్రుడు నిజాయితీతో కూడిన రాజకీయాలు చేస్తారని, అందుకే ఏ విషయమైనా కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడారని చెప్పారు. తమ కుటుంబం అవినీతి రాజకీయాలకు దూరంగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల వ్యవధిలోనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.117 కోట్లు నిధులు తీసుకువచ్చారని తెలిపారు. నిస్వార్థంగా సేవ చేసే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు మాట్లాడుతూ తెలుగుదేశంలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు ఉన్నారన్నారు. నియోజకవర్గంలో 50 వేలకుపైగా సభ్యత్వాలు నమోదు చేసుకున్నారని తెలిపారు. కార్యకర్తల త్యాగంతోనే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. వైసీపీ నియంత పాలనలో మాట్లాడేందుకు భయపడే పరిస్థితిలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చిన ఘనత అయ్యన్నపాత్రుడుదని ఆయన పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం 2024 సార్వత్రిక ఎన్నికలలో బూత్ స్థాయిలో మెజారిటీ సాధించిన ఇన్‌చార్జులు, 80 ఏళ్ల వయస్సులో కూడా పార్టీ కోసం చురుగ్గా పని చేస్తున్న కార్యకర్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నయాకులు చింతకాయల రాజేశ్, గవిరెడ్డి వెంకటరమణ, కాశీనాయుడు, నందిపల్లి వెంకటరమణ, ఆర్‌వై పాత్రుడు, అడిగర్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యత పరిశీలనకు నమూనాల సేకరణ



రోడ్డు నాణ్యతపై నమూనాలు సేకరిస్తున్న అధికారులు

గొలుగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ-నాతవరం మండలాలకు చెందిన లింకు రోడ్డు నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ ఈఈ యూవీ.ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ శాంపిళ్లను సేకరించారు. మండలంలోని సాలికమల్లవరం నుంచి వెంకటాపురం గ్రామం వరకు ఏర్పాటైన బీటీ రోడ్డును పరిశీలించి, బిల్లుల మంజూరుకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని ఈఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డీఈ ఈశ్వరరావు, ప్రాజెక్టు డీఈ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే..

» మండల కేంద్రాల్లో కార్మిక సంఘాల ఆందోళన



చోడవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

చోడవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కార్మిక సంఘాల ప్రతినిధులు ఆందోళనకు దిగారు. చోడవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ, ఆశ, పారిశుధ్య, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొని నినాదాలు చేశారు. కార్మికులను అణచివేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల రూపంలో ప్రవేశపెట్టిందని, ఈ కోడ్‌లు అమలైతే కార్మికులు మరింత దోపిడీకి గురవుతారని సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ.శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు, 1214 మెమోను రద్దు చేసి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు నిలిపివేయడంతో పాటు, స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, కార్మిక సంఘాల నాయకులు కొండమ్మ, ఎర్రయ్యమ్మ, బి. లక్ష్మి, వరలక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో...



చీడికాడలో నినాదాలు చేస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

చీడికాడ: మండల కేంద్రంలో వివిధ సంఘాల కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మికులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ మండల సంఘాల నాయకులు లాలం కామాక్షి, తంగేటి మంగ, అమ్మాజీ, బి.ఉమ, పైడితల్లమ్మ, పోతల భారతి పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి మూడు రోడ్ల వరకు కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నేత గండి నాయనబాబు మాట్లాడుతూ పలు డిమాండ్లతో చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు పి.భవాని, గట్టు నాగమణి, కె.దుర్గారావు, కర్రి సత్యం, కార్మికులు పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం: మండల కేంద్రంలో లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న డిమాండ్‌తో కార్మికులు ఆందోళనకు దిగారు. కార్మికులకు వేతనాలు చెల్లించాలని, పారిశుధ్య పరికరాలు ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ వి.సత్యవతి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు ఎస్.లక్ష్మి, కె.సంధ్య, వై.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదిలో దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కార్మికులు ర్యాలీ, మానవహారం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత ఎస్‌వీ.నాయుడు మాట్లాడుతూ లేబర్‌కోడ్స్ రద్దుచేయాలని, కార్మికుల సంక్షేమ పథకాలు అమలుచేయాలని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యలను ఆపాలని, స్కీమ్ వర్కర్స్‌కు కనీస వేతనాలు అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఇంజనీర్ల కొరత

» 17 సచివాలయాల్లో ఐదుగురే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

» నాతవరం మండల వ్యాప్తంగా 12 సచివాలయాల్లో ఖాళీలు

» పోస్టులు భర్తీ కాకపోవడంతో ఉన్నవారిపై పని భారం

» ఒక్కొక్కరికి నాలుగేసి సచివాలయాల బాధ్యతలు



ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టు భర్తీకానీ నాతవరం సచివాలయం

నాతవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్ల కొరత వేధిస్తోంది. మండల వ్యాప్తంగా సగం మంది కూడా ఇంజనీర్లు లేకపోవడంతో ఉన్న వారిపైనే పని భారం పడుతోంది. మొత్తం 17 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. 17 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉండాల్సి ఉండగా, ఐదుగురు మాత్రమే పని చేస్తున్నారు. ఇంకా 12 ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఉన్న ఐదుగురిపైనే పనిభారం పడుతోంది. ఒక్కొక్క ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు నాలుగేసి గ్రామ సచివాలయాల బాధ్యతలు అప్పగిస్తున్నారు.

మండలంలోని గొలుగొండపేట, మన్యపురట్ల, శృంగవరం, చెర్లోపాలెం, వైడీపేట, చమ్మచింత, నాతవరం-1, నాతవరం-2, గునుపూడి, గన్నవరం, ఎంబీపట్నం, వల్సంపేట గ్రామ సచివాలయాల్లో ఇప్పటికీ ఇంజనీరింగ్ పోస్టులు భర్తీ కాలేదు. రెండు వంతులకుపైగా గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ పోస్టులు ఖాళీగా ఉండడంతో గ్రామాల్లో జరిగే పంచాయతీరాజ్ పనులపై ప్రభావం పడుతోంది. పనుల పర్యవేక్షణతో పాటు ఎం.బుక్ రికార్డు చేయడం, వర్కు అంచనాలు తయారు తదితర పనుల విషయంలో జాప్యం జరుగుతోంది. కాగా, నాలుగేసి సచియవాల్లో పనులను చూడడం తలకు మించిన భారంగా ఉందని గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి 12 గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు కోరుతున్నారు.

ఆదాయం ఘనం.. సదుపాయాలు శూన్యం!

» దేవరాపల్లి మార్కెట్‌లో కనీస వసతుల కరువు

» బహిరంగ ప్రదేశంలోనే వ్యాపార లావాదేవీలు

» షెడ్లు లేకపోవడంతో రైతుల ఇక్కట్లు



మార్కెట్‌లో షెడ్లు లేక ఎండలో కూరగాయలు అమ్ముతున్న రైతులు

దేవరాపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్‌లో రైతులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. రైతులు వ్యయప్రయాసాలకుకోర్చి తీసుకువస్తున్న కూరకాయలను అమ్మడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఆదాయం దండిగా వస్తున్నప్పటికీ, మార్కెట్‌లో కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో రైతులకు ఈ దుస్థితి తప్పడం లేదు. షెడ్లు లేకపోవడంతో వర్షమైనా, ఎండైనా రైతులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు.



వర్షంలోనే తడుస్తూ కూరగాయలు అమ్ముతున్న రైతులు

మండలంలోని 70 శాతం రైతులు కూరకాయలు పండిస్తారు. ప్రతి రోజూ నాలుగైదు రకాల కూరకాయలను దేవరాపల్లి మార్కెట్‌కు తీసుకువస్తారు. విశాఖపట్నం రైతుబజార్లకు, విజయనగరం జిల్లా, పలు మండలాలకు ఇక్కడ నుంచే కూరగాయలను వ్యాపారులు తీసుకు వెళ్తుంటారు.

రైతులు తెచ్చిన కూరకాయలను కాలువ గట్టుపై ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు అమ్ముతుంటారు. ప్రతీ క్రేటు, తట్ట, లేదా మూట, ఏదైనా పంచాయతీ ఆశీలు రూ.ఐదు చెల్లిస్తారు. ఈ ఆశీల పాటను ఈ ఏడాది రూ.12.8 లక్షలకు పాడారు. వచ్చే మార్చి వరకు ఇతను ఆశీలు వసూలు చేసి పంచాయతీకి చెల్లిస్తారు. ఇంత ఆదాయం వస్తున్నా మార్కెట్‌లో నిలువ నీడ లేదు. సరికదా తాగడానికి నీరు అందుబాటులో ఉంచరు. వసూలే తప్ప సౌఖర్యాలు లేని రోడ్లపై అమ్మకాలు సాగిస్తుంటారు. అయినా పట్టించుకునే నాథులు లేకపోవడం దయనీయ స్థితిలో రైతులు వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు.

ఘనంగా గదబపాలెం మోదకొండమ్మ జాతర

రావికమతం, మే 20 (ఆంధ్రజ్యోతి): టి.అర్జాపురం, చిలకవానిపాలెంతో పాటు ఆరు ఆదివాసీ గ్రామాల భక్తులకు ఆరాధ్య దైవంగా కొలచే గదబపాలెం మోదకొండమ్మతల్లి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది మహిళలు, భక్తులు అమ్మవారి దర్శనానికి మంగళవారం వేకువ జాము నుంచే తరలివచ్చి బారులు తీరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్, సర్పంచ్ మడగల ఫాల్గుణ ఆధ్వర్యంలో ఉదయం నుంచి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వందలాది మంది భక్తులు సంబరంగా ఘటాలతో కిలోమీటర్ల మేర ఊరేగిపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.



అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఉత్సహంగా జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు

కె.గదబపాలెం మోదమాంబ పండుగ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు ఉత్సహంగా నిర్వహించారు. ఈ పోటీల్లో అర్జునగిరి, లెక్కలవానిపాలెం, చుక్కపల్లి, ముందుర్తి, మురుకుర్తి హరికృష్ణ తదితర ఎడ్ల బండ్లు పాల్గొన్నాయి. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

కొమరవోలులో ఉపాధి పనులు కల్పించాలి



ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రోలుగుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): మండంలోని కొమరవోలు ఆవలో ఉపాధి హమీ పథకం కింద పనులు కల్పించి కూలీల వలసలను నిరోధించాలని కన్నంపేట గ్రామస్థులు కోరారు. ఈ మేరకు చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు టీడీపీ గ్రామ అధ్యక్షుడు కోసూరు ఆనందరావు, గ్రామానికి చెందిన కోట గోవిందరావు, బంటు శ్రీనివాసరావు తదితరులు మంగళవారం వినతిపత్రం అందించారు. కన్నంపేట గ్రామానికి చెందిన ఉపాధి కూలీలకు పనులు లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీంతో అధిక శాతం మంది ఇతర ప్రాంతాలకు పనుల నిమిత్తం వలస వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అవలో పనులు కల్పించాలని కోరారు. అలాగే ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి విశారపు బాబూరావు కళ్లాల వరకు మెటల్ రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేయాలని వారు విన్నవించారు.

సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాట యోధుడు టంగుటూరి

నర్సీపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘనంగా నివాళులర్పించారు. కొత్తవీధి రోడ్డులో పెద్ద చెరువు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి మంగళవారం పూలమాల వేశారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎంఈవో నాగేశ్వరావు, హెచ్‌ఎం ప్రసాద్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు అని కొనియాడారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తూపాకీకి ఎదురుగా నిలిచి ఆంధ్ర కేసరిగా పేరు సార్థకం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ట్రెజర్ అల్లు అప్పారావు, సహాయ కార్యదర్శి శంకర్‌రెడ్డి, బాబీ మాస్టారు, ఊడా వెంకట్రావు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు విగ్రహానికి పూల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నేడు మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఎన్నిక

మాడుగుల, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ ఎన్నిక బుధవారం జరగనుంది. మోదకొండమ్మ అమ్మవారి ఆలయానికి సంబంధించి శాశ్వత కమిటీ సభ్యుడు లేకపోవడంతో ఉన్న సభ్యులు చర్యలు తీసుకొని రెండు పర్యాయాలుగా కమిటీని డ్రా పద్ధతిలో ఏర్పాటుచేసేందుకు ప్రధాన కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఈ దశలో రెండేళ్ల క్రితం ఏర్పాటైన ఉత్సవ కమిటీ కాల పరిమితి పూర్తికావడంతో నూతన కమిటీని ఏర్పాటుచేసేందుకు ఆసక్తిగల వారికి మంగళవారం దరఖాస్తులు అందించారు. ఆలయ కమిటీ సభ్యునిగా ఎన్నికైన వారు మరలా పాల్గొనరాదని, ఆలయానికి సంబంధించి ఏ విధమైన బకాయిలు ఉండకూడదని, హిందూమతానికి చెందినవారై ఉండాలని, ఉద్యోగులై ఉండకూడదని తదితర 12 అంశాలతో కూడిన నియమ నిబంధనలు పొందుపరుస్తూ దరఖాస్తులు అందించారు. వీటికి ఆధార్ కార్డు జతచేస్తూ బుధవారం మధ్యాహ్నం కమిటీకి అందజేస్తే, సాయంత్రం నాలుగు గంటలకు ఉత్సవ కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు తెలిపారు. డ్రా పద్ధతిలో ఎంపికైన వ్యక్తి లేకపోతే, దాన్ని రద్దుపరచి మరొకరికి అవకాశం కల్పించడం జరుగుతుందని వారు చెప్పారు.

మోస్తరు వర్షం... జనం ఉపశమనం



దేవరాపల్లిలో హోరున కురుస్తున్న వర్షం

దేవరాపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనాల కారణంగా మంగళవారం ఉదయం మోస్తరు వర్షం పడింది. జిల్లాలోని పలు మండలాల్లో వేకువ జాము నుంచే జోరు వాన కురిసింది. దేవరాపల్లి మండలంలో ఉదయం 11 గంటల వరకు వర్షం పడింది. మరలా వాతావరణం మార్పు వచ్చింది. ఈ వర్షం వల్ల వేసవి దుక్కులు, కూరగాయలు, సరుగుడు నాట్లకు మేలు చేకూరుతుందని రైతులు చెప్పారు.

గొలుగొండ మండలంలో...

గొలుగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన పడింది. జోగంపేట, గొలుగొండ, చీడిగుమ్మల, పాకలపాడు, ఏటిఐరంపేట, రావణాపల్లి, కొత్తఎల్లవరం, పాతమల్లంపేట గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి. దీంతో వాతావరణం చల్లబడింది. ఫలితంగా ఎండ వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

మాడుగుల మండలంలో...

మాడుగుల రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం మోస్తరు వర్షం పడింది. తెల్లవారేసరికి తేలికపాటి జల్లులతో ఆరంభమై మోస్తరు వర్షం కురిసింది. తర్వాత కాస్త తెరిపిచ్చి, అనంతరం ఎండ కాసింది. దీంతో పొడి వాతావరణం నెలకొంది. ఫలితంగా వర్షం పడినా మండలంలో ఉక్కపోతకు మాత్రం తగ్గలేదు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోండి

మాకవరపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. మండలంలో సుమారు 15 వేల మంది రైతులు అన్నదాత సుఖీభవ పొందుతారన్నారు. ఇంతవరకు సుమారు ఎనిమిది వేల మంది రైతులు తమ పేర్లను అన్‌లైన్ చేసుకున్నారని ఆయన చెప్పారు. భూమి అన్‌లైన్‌లో ఉన్న రైతులు తమ దగ్గరలో ఉన్న గ్రామ సచివాలయంలో అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

దేవరాపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం డిమాండ్ చేసింది. రైవాడ అతిథి గృహం వద్ద మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో సంఘ మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. తాళ్లతో కట్టి అతన్ని హింసించడం దారుణమన్నారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషణం, సబ్బవరపు మాలిబాబు, రామారావు పాల్గొన్నారు.

కింతలిలో పైడితల్లమ్మ పండుగ

మాడుగుల రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కింతలి గ్రామంలో మంగళవారం పైడితల్లమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షైచర్ల భవాని, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎం.కోడూరులో మోదకొండమ్మను దర్శించుకున్న నాయకులు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరు గ్రామదేవత మోదకొండమ్మను మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, పీసీసీ మాజీ అధ్యక్షులు సతీశ్‌వర్మ తదితరులు మంగళవారం దర్శించుకున్నారు. వీరిని సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

బుచ్చెయ్యపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. వారి నుంచి రూ.18,160 నగదు స్వాధీనం చేసుకుని, వారిని కోర్టుకు తరలించామని ఆయన చెప్పారు.

హెచ్ఐవీపై అవగాహన

నర్సీపట్నం అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కోసం మంగళవారం కళాజాత నిర్వహించారు. వేంకటేశ్వర కళా బృందం వారితో వీధి నాటకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ ఎలా వస్తుంది, సుఖ వ్యాధులు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సమిధ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది డి.వీరభద్రరావు, ప్రాజెక్టు మేనేజర్ వరహాలుబాబు, ఏఎన్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

దేవరాపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం భగవద్గీతపై ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీత గురించి తెలుసుకోవాలని సూచించారు. కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం, దైవ దర్శనాలపై ఆయన అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు జి.కృష్ణ, సూరప్పడు, సురేశ్, భవాని పాల్గొన్నారు.

సీపీఎం నేత సత్తిబాబుకు నివాళి

నర్సీపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సీపీఎం నేత సత్తిబాబుకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, అమర్, ఆర్కేనాయుడు, ఎల్.గౌరీ, కె.త్రిమూర్తులురెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

నర్సీపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): తురబడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఏప్రిల్ 8వ తేదీ నుంచి కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. బాలిక సొంత ఊరు ఎలమంచిలి కాగా తురబడిలో ఎనిమిదో తరగతి చదువుతున్నదని చెప్పారు. ఆచూకీ తెలిస్తే 9490760572, 9493617565 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

'రాజాంలో అక్రమ విద్యుత్ కనక్షన్లు'

బుచ్చెయ్యపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజాం గ్రామంలో అక్రమ కట్టడాలకు పంచాయతీ అనుమతులు లేకుండా విద్యుత్ అధికారులు మీటర్లు ఇస్తున్నారని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మరిసా నాని ఆరోపించారు. వై జంక్షన్‌లోని వాణిజ్య కట్టడాలకు కూడా పంచాయతీ ఎన్‌వోసీ, ఇంటి పన్ను రశీదు లేకుండానే విద్యుత్ కనక్షన్‌లు మంజూరు చేస్తున్నారని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.


డి. కొత్తూరు ఏకల్వ పాఠశాల వద్ద గొయ్యి


బి. కొత్తూరు వెళ్లే రహదారి సమీపంలో పెచ్చులూడిన దృశ్యం

అడుగుకో గొయ్యి.. ఆదమరిస్తే ప్రమాదమే!

» చోద్యం- బాలారం ప్రధాన రహదారి దుస్థితి

» గత వైసీపీ పాలనలో శంకుస్థాపన..పనులు చేపట్టని వైనం

» 40 గ్రామాల ప్రజల రాకపోకలకు అవస్థలు

కొయ్యూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో మండలంలో సుమారు 40 గ్రామాలకు ఆధారమైన చోద్యం- బాలారం ప్రధాన రహదారి శిథిలావస్థకు చేరి, కనీసం ద్విచక్ర వాహనదారులు సైతం వెళ్లలేని దుస్థితికి చేరింది. చోద్యం నుంచి బాలారం వెళ్లే ఈ రోడ్డులో అడుగో గొయ్యి, గజానికో గుంతతో నిండి ఉంటోంది. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. రహదారి మరమ్మతులకు గానూ గత ప్రభుత్వ హయాంలో రూ. 2 కోట్లు మంజూరు చేసినట్టు ప్రకటించి, అప్పటి పాడేరు ఎమ్మెల్యే భా గ్యలక్ష్మి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు.కానీ, రోడ్డు నిధులు మంజూరు కాలేదు. బాలారం, కంఠారం, బకులూరు, కొమ్మిక ఆడాకుల, పంచాయతీల పరిధిలోని సుమారు 40 గ్రామాల ప్రజలు ఏదైనా అవసరాలకు మైదాన ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ రహదారే ఆధారం. అటువంటి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గత ప్రభుత్వ హయాంలో ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు ఉన్నతాధికారులకు, పాలకులకు వినతులు ఇచ్చినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. గత ఎన్నికలు మరో సంవత్సరం ఉందనగా గతంలో పాడేరు ఎమ్మెల్యే ఈ రహదారి మరమ్మతులకు నిధులు మంజూరైనట్టు తెలిపి, శంకుస్థాపన చేశారు. పనులు మా త్రం చేపట్టలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రహదారి మరింత అధ్వానంగా తయారై గుంతల వద్ద చెరువులను తలపించేలా మారింది. బాలారం సమీప ఏకలవ్య పాఠశాలనుంచి డి. మల్లవరం వరకు ఉన్న ఛిద్రమైంది. మల్లవరం- కొత్తూరుల మధ్య సుమారు 2 కిలోమీటర్లు అడుగడుగున మోకాలు లోతు గోతులతో దర్శనమిస్తోంది. కొత్తూరు నుంచి కన్నపేట మధ్య పెద్ద గోతులు నీరు నిల్వ ఉంటోంది. దీంతో ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. అత్యవసర సమయాలలో సైతం ప్రయాణించాలంటే ప్రాణాలకు తెగించాల్సి వస్తోందని వాహనచోదకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం మారినందున ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకుని కనీసం గుంతలు పూడ్చేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న దొన్నుదొర, శ్రావణ్‌కుమార్, పరిశీలకులు


మినీ మహానాడులో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దాం

» మినీ మహానాడులో విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు ఇన్‌చార్జి దొన్నుదొర

అరకులోయ, మే 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పేద ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీని స్థాపించారని, ఆయన ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కట్టుబడి పనిచేయాలని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియారి దొన్నుదొర పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టూరిజం హరిత రిసార్టు ప్రాంగణంలో నియోజకవర్గస్థాయి మినీ మహానాడు దొన్నుదొర అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో దొన్నుదొర, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, పార్లమెంట్, అసెంబ్లీ పార్టీ పరిశీలకులు హర్షవర్ధన్, సబ్బవరపు గణేశ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దొన్నుదొర మాట్లాడుతూ ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చి పేదలకు కూడు, గుడ్డ, గూడు నినాదంతో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆయన బాటలో ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి, పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారన్నారు. పార్టీ జాతీయ కార్యదర్శి ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో చట్టంగొంది, రణజిల్ల డలలో మినీ రిజర్వాయర్లు నిర్మించాలని, ఈ ప్రాంతంలో యువతీ, యువకులకు టూరిజం, ఇతర వనరుల ఆధారంగా చిన్నతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని యువనేత లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు.వీటిపై సానకూలంగా స్పందించారన్నారు. అరకు కాఫీకి ముఖ్యమంత్రి అంబాసిడర్‌గా వ్యవహరించి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చారన్నారు. కాఫీ, మిరియాలకు గిట్టుబాటుధరకు చర్యలు తీసుకున్నారన్నారు. కాఫీ రైతులకు ప్రత్యేక ప్రాజెక్టును తీసుకువచ్చినట్టు వివరించారు. అరకు పార్లమెంట్ పరిశీలకులు హర్షవర్ధన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రతీ ఒక్కరు క్రమశిక్షణతో నడుచుకోవాలన్నారు. అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు గణేశ్ మాట్లాడుతూ సమష్టిగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మద్దతుదారులు విజయానికి కృషి చేయాలని కోరారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ పరంగా తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, పలు విభాగాల నాయకులు,,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పరిశీలకుడు హర్షవర్ధన్ సభాప్రాంగణం నుంచి వీరందరితో ప్రతిజ్ఞ చేయించారు.

రాళ్లగెడ్డ-లోతుగెడ్డ రోడ్డు నిర్మించాలి


రహదారి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనుల

చింతపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లగెడ్డ-లోతుగెడ్డ రహదారి నిర్మించాలని స్థానిక గిరిజనులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రహదారిపై కుడుముసారి, నిమ్మలపాలెంనకు చెందిన ఆదివాసీలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోతుగెడ్డ బ్రిడ్జీ నుంచి రాళ్లగెడ్డ గ్రామం వరకు రహదారి అత్యంత అధ్వానంగా తయారైందన్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, వాహనాలు మరమ్మతులకు గురువుతున్నాయన్నారు. అధికారులు, పాలకులు స్పందించి రాళ్లగెడ్డ రహదారి నిర్మించాలని గిరిజనులు తెలిపారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కార్మికుల సమ్మె విజయవంతం

» కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన

పాడేరురూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన ఒక్కరోజు సమ్మె విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూ నియన్ జిల్లా అధ్యక్షుడు కె.వాసు మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం గత ఏడేళ్లుగా నెలకు రూ. 8,800 మాత్రమే తమకు వేతనం చెల్లిస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి యాజమాన్యంలో అవుట్ సోర్సింగ్ డ్రైవర్ల వేతనం నెలకు రూ. 18.500 చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ యాజమాన్యమే చెల్లించాలని, చట్ట ప్రకారం వీక్లీ, పండగ, జాతీ య సెలవులు అమలు చేయాలని, విధి నిర్వహణకు అవసరమైన సెల్ ఫోన్‌లు ఇవ్వాలని, రీచార్జ్ బిల్లులు చెల్లించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలనే తదితర 12 డిమాండ్‌లు చేశారు.అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందించారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కార్మికులు

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, నాయకుడు ఎల్.సుందరరావు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కార్మికుల గౌరవాధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, జిల్లా నాయకులు పి.దామోదర్, పి.సింహాచలం, కొండబాబు, విష్ణు, మౌళి, రాజారావు, దుర్గాప్రసాద్, బాలన్న, జయరాం, అనిల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

» మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన మైదాన ప్రాంత భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాడేరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. అయితే, ఈ సమయంలో రద్దీని దృష్ట్యా మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు ఏటా పండగ జరిగిన తరువాత వచ్చే మొదటి ఆదివారం, మంగళవారం ఆలయానికి ఘటాలతో వచ్చి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో మన్యంలోని వివిధ మండలాలతోపాటు అనకాపల్లి, విశాఖపట్నం తదితర జిల్లాల నుంచి వందలాది మంది భక్తులు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో మంగళవారం ఆలయానికి అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వరకు గడపటంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో

పాడేరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని డీ ఎంహెచ్‌వో షేక్ జమీల్‌బాషా తెలిపారు. అటువంటి స్కానింగ్ సెం టర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. గర్భస్థ శిశు ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవడానికే స్కానింగ్‌లు నిర్వహించాలి తప్ప వాటిని ఆసరాగా తీసుకుని లింగ నిర్ధారణ వివరాలు వెల్లడించడం నేరమన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా స్థాయి సలహా మండలి సమావేశాన్ని తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అల్లూరి జి ల్లా వ్యాప్తంగా 14 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, వాటిలో 11 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉండగా మూడు సెంటర్లు ప్రైవేటు ఆస్పత్రులలో ఉ న్నట్టు పేర్కొన్నారు. ప్రతీ స్కానింగ్ సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆయా కేంద్రాలపై ప్రోగ్రాం అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో బాల బాలికలు ఇద్దరూ సమానమేనని స్త్రీల పట్ల విక్షత చూపించరాదన్నారు. ఇటీ వల చాలా మంది లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని వాటి ఆధారంగా గర్భస్రావం చేయించుకొనే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలతో ఇబ్బందులు తప్పవనే విషయాన్ని కుటుంబ స భ్యులకు అవగాహన కల్పించాలన్నారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మంగళవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈనెల 25తేదీ వరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 10మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 20మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. గాలిలో తేమ 67-90శాతం ఉంటుందని తెలిపారు.

జీకేవీధి, హుకుంపేటలో 34.6 డిగ్రీలు

పాడేరు: మన్యంలో వానాకాల వాతావరణం నెలకొంటున్నా ఎండల తీవ్రత కొనసాగుతున్నది. ఫలితం గా ఉష్ణోగ్రతల్లో పెద్ద మార్పు కన్పించడం లేదు. మంగళవారం జీకేవీధి, హుకుంపేటలో 34.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా పాడేరులో 34.3, కొయ్యూరులో 33.8, డుంబ్రిగుడలో 31.8, చింతపల్లిలో 31.0, పెదబయలులో 30.2, అరకులోయలో 29.1, అనంతగిరిలో 29.0, జి.మాడుగులలో 28.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

టెన్త్ సప్లిమెంటరీకి అధిక సంఖ్యలో విద్యార్థులు గైర్హాజరు

చింతపల్లిలోని మూడు పరీక్ష కేంద్రాల్లో

47మందికి.. ఏడుగురే హాజరు

చింతపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న పదోవ త రగతి సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు అధిక సంఖ్యలో గైర్హాజరయ్యారు. మంగళవారం మూడు పరీక్ష కేంద్రాల్లో 47మంది హిందీ పరీక్ష రాయాల్సి ఉండగా, కేవలం ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ విద్యార్థుల గైర్హాజరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. మండలంలోని గిరిజన సంక్షేమశాఖ బాలికలు, బాలూర ఆశ్రమ పాఠశాలలు, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత, కేజీబీవీ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ ఏడాది పది ఫలితాల్లో 18.5శాతం విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాస్ కాలేదు. ఈ విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేసింది. అయితే పది తప్పిన


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

విద్యార్థులు శతశాతం పరీక్షలు రాసేందుకు ఫీజు చెల్లించారు. అయితే, సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడంలేదు. గణితం, సైన్సు పరీక్షలు తప్పిన విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈమేరకు బుధ, గురు, శుక్రవారాల్లో పరీక్షలకు ఏ స్థాయిలో విద్యార్థులు హాజరవుతారనేది ప్రశ్నార్థంగా మారింది. మరోవైపు ఓపెన్ స్కూల్ విద్యార్థులు పూర్తి స్థాయిలో హాజరవుతున్నారు. ఈకార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ జేపీ కొండలరావు, సిటింగ్ స్క్వాడ్ జీవీఆర్ మూర్తి పాల్గొన్నారు.

‘అవినీతి అధికారులకు మద్దతు తగదు’

జి.మాడుగుల, మే 20 (ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారులకు ఉపాధ్యాయ సంఘాలు వంతపాడడం సరికాదని డీఎల్‌వో రాష్ట్ర సలహాదారులు సమిరెడ్డి మాణిక్యం అన్నారు. మంళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఆదివాసీల హక్కులు, ఐటీడీఏలో నిబంధనలకు విరుద్ధంగా ఒకే కార్యాలయంలో తిష్ఠవేసి ఉద్యోగాల్లో కొనసాగుతున్నారన్నారు గిరిజన ఆశ్రమాల్లో విద్యార్థుల మృతిపై ఇటీవల డీఎల్‌వో విడుదల చేసిన కరపత్రాన్ని తప్పు పడుతూ, గిరిజన ఉపాధ్యాయ సంఘం డీడీని వెనకేసుకు రావడం ఏమేరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

అన్న సమారాధన


భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అరకులోయ, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వర ఆలయంలో స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని భక్తులతో పాటు ఇతర ప్రాంత ప్రజలు 1500 మంది పాల్గొన్నట్టు అలయ, ఉత్సవ కమిటీ చైర్మన్లు పెట్టెలి దాసుబాబు. సివేరి బాలకృష్ణ తెలిపారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 8 నుంచి 10 తేది వరకు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దాతల ఆర్థికసాయంతో ఈ అన్నసమారాధన చేపట్టినట్టు వారు తెలిపారు.

మినీ సంపద కేంద్రాల ఏర్పాటుకి సర్వే: ఎంపీడీవో


వర్మీకంపోస్టుని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, మే 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో మినీ సంపద కేంద్రాల ఏర్పాటుకి సర్వే చేస్తున్నట్టు స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో సంకాడ గ్రా మ సచివాలయం, సంపద కేంద్రాన్ని సందర్శించారు. సంపద కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్న వర్మికంపోస్టు ఎరువును పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 280 జనాభా కలిగిన గ్రామాల్లో మినీ సంపద కేంద్రాలను మంజూరు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారన్నారు. ఈమేరకు సర్వే చేసి గ్రామాల జాబితాను కలెక్టర్‌కి అందజేస్తాన్నారు. ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

టీడీపీ చౌడుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మధు


గ్రామకమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు

చింతపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడుపల్లి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొర్ర మధు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం గ్రామ కమిటీ సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడిగా గడుతూరి బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శిగా కొర్ర బాలరాజు, కోశాధికారిగా కిల్లో లోకేశ్, కార్యదర్శులుగా శివ కుమార్, సీతారామ్, చంటిబాబు, కార్య నిర్వాహక కార్యదర్శులు సరమండ శివకుమార్, సాగిన శేఖర్, రామారావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు అరడా వీరబాబు, నాయకులు శెట్టి నాగేశ్వరరావు, వంతల భీమన్న, చితుకులదొర, దేహూరి వెంగళయ్య, మంగు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

‘సీపీఐ బలోపేతానికి కృషి’

చింతపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మండల కార్యదర్శి పేట్ల పోతురాజు అన్నారు. మంగళవారం బౌర్తి గ్రామంలో శాఖ కార్యదర్శిల సమావేశం జరిగింది. తొలుత బౌర్తి శాఖ కార్యదర్శిగా పొత్తూరు చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సీపీఐ బలంగా ఉన్నదన్నారు. పార్టీ కార్యకర్తలు పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గెమ్మెలి కుజ్జన్న, సుబ్బారావు, కామేశ్వరరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ రద్దు చేయాలి

గూడెంకొత్తవీధి, మే 20 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్ రద్దు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. మంగళవారం రింతాడ గ్రామ సచివాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్లగా పదోన్నతి కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అలాగే లేబర్ కోడ్‌ను రద్దు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమలి అప్పలనరస, దయ వెంకటి, మీనాక్షి కుమారి, సుభద్ర పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఘనంగా తిరంగా ర్యాలీలు

» పాకిస్థాన్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు

ముంచంగిపుట్టు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దుర్గాదేవి ఆలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా పోలీసు స్టేషన్ కూడలి వరకు జాతీయ జెండాలను చేతపట్టుకు దేశ సైనికులకు మద్దతుగా ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ అధ్యక్షులు జిల్లా పాంగి రాజారావు మాట్లాడుతూ భారత జవాన్లు దేశం గర్వించదగిన రీతిలో పోరాట పటిమ ప్రదర్శిస్తున్నారన్నారు. వారి త్యాగాలను మరవకూడదని అన్నారు. దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీ సరైన సమయంలో సిందూర్ ఆపరేషన్‌పై నిర్ణయం తీసుకుని పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పారన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేయడంతో మన సైనం


జి. మాడుగులలో ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు



ముంచంగిపుట్టులో తిరంగా ర్యాలీ చేస్తున్న బీజేపీ, జనసేన నాయకులు

అసాధారణ పనితీరును ప్రదర్శించిందని కోరారు. అలాగే, కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి చంపడం ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన నాయకులు శాంతకుమారి, నాగరాజు, మత్స్యరాజు, సుబ్బారావు, శ్రావణ్ కుమార్, గోపాలపాత్రుడు, లక్ష్మణ్, కొండబాబు, సాధురాం, సతీష్ కుమార్, సీతారాం, భగత్రామ్, నాగేశ్వరరావు, కర్రిబాబు పాల్గొన్నారు.

జి. మాడుగులలో..

జి.మాడుగుల: ఆపరేషన్ సిందూర్ విజయంపై తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమై పలు వీధులు మీదుగా సాగింది. భారత సైనికులకు మద్దతుగా నినదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.అప్పలరాజు, ట్రైకర్ డైరెక్టర్ కూడ కృష్ణారావు, బీజేపీ నేత ఉమమహేశ్వరరావు, టీడీపీ ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, జనసేన మండల నాయకుడు వెంకటరమణ, భీంబాబు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెం హత్య కేసులో ఏడుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్, వెనుక వరుసలో నిందితులు

పరవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన హత్యకు సంబంధించి ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పరవాడ డిఎస్పీ వల్లెం విష్ణుస్వరూప్ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి బంగార్రాజు వద్ద చింతకాయల ఎర్రయ్య రూ. 63వేలు అప్పుగా తీసుకున్నాడు. రూ.45వేలు చెల్లించిన ఎర్రయ్య మిగతా రూ. 18వేలు బాకీ తీర్చలేదు. ఈ క్రమంలో ఈ నెల 18న రాత్రి బాకీ విషయమై బంగార్రాజు .... ఎర్రయ్యకు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఎర్రయ్యకు వరుసకు మేనల్లుడైన కొవిరి కామేశ్ అలియాస్ కామరాజు కత్తితో బంగార్రాజుపై దాడి చేసి హతమార్చాడు. ఈ దాడిలో కామరాజు తమ్ముడు శివాజీ, మిగతా కుటుంబసభ్యులు సహకరించారు. హత్య అనంతరం వారంతా అక్కడి నుంచి పరారయ్యారు. ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి పోలీస్ స్టేషన్‌ల నుంచి సిబ్బంది ఐదు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం నిందితులందరినీ అచ్యుతాపురం మండలం మడుతూరు వద్ద పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కొవిరి కామేశ్ అలియాస్ కామరాజుతో పాటు కొవిరి శివాజీ, కొవిరి ఆర్మీ ముత్యాలు, చింతకాయల ఎర్రయ్య, కొవిరి ముత్యాలు, వాసుపల్లి ప్రవీణ్‌కుమార్, కొవిరి ముత్యాలమ్మగా గుర్తించారు. హత్యకు ఉపయోగించిన కత్తి, ఐరన్‌రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన 36 గంటల్లో నిందితులను పట్టుకున్నారు. నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు. హత్య నేపథ్యంలో ముత్యాలమ్మపాలెంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్‌ఐలు బి.కృష్ణారావు, వి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన డీఆర్వో



ఈవీఎం గోడౌన్ తనిఖీకి విచ్చేసిన అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు

అనకాపల్లి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను డీఆర్వో వై.సత్యనారాయణరావు మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలలో భాగంగా ఈవీఎం మెషీన్లు భద్రపరిచిన గోడౌన్ సీళ్లు, సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో వై.శ్రీనివాసరావు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ నాయుడులతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలపై తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల ధర్నా



నెహ్రూచౌక్‌లో ధర్నా చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

అనకాపల్లి టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు మంగళవారం ఇక్కడ ఒకరోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా నెహ్రూచౌక్‌లో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ పదేళ్లుగా కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత వంటివి లేక సమస్యల నడుమ సదరు కార్మికులు విధులను నిర్వహిస్తున్నారన్నారు. నాలుగు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వెంటనే వీరి సమస్యలపై ప్రభుత్వం స్పందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు నరసింగరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 నుంచి చిరంజీవి జన్మదిన వారోత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గేయ రచయిత రామజోగయ్యశాస్త్రి, తదితరులు

అనకాపల్లి టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వారోత్సవాలను ఆగస్టు 15 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నామని అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ ఉపాధ్యక్షుడు గళ్ళా కొండలరావు తెలిపారు. మంగళవారం ఇక్కడున్న ఓ హోటల్‌లో ప్రముఖ సినీ గేయ రచయిత రామజోగయ్యశాస్త్రి చేతుల మీదుగా వారోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా ఒక్కో రోజు ఒక్కొక్క సేవా కార్యక్రమాన్ని చేపడతామని వివరించారు. ఈ కార్య క్రమంలో ఫ్యాన్స్ ప్రతినిధులు శ్రీరామదాసు గోవిందరావు, మళ్ల శ్రీను, కొమ్మోజు రాజు, కొణతాల శ్రీను, బొడ్డేడ శ్రీను, నగిరెడ్డి మధు తదితరులు పాల్గొన్నారు.

'పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి'



మాట్లాడుతున్న కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ ప్రభాకర్‌రావు

అనకాపల్లి టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించే పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలో చక్కెర కర్మాగారాలు దయనీయ స్థితికి ప్రభుత్వ అలసత్వమే కారణంగా పేర్కొన్నారు. జిల్లాలో నీటిపారుదల వ్యవస్థను మెరుగుపర్చాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ గిడ్డంగులు నిర్మించక పోవడం వల్ల రైతులు పూర్తిగా నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు, అనకాపల్లి, ఎలమంచిలి, మాడుగుల, పాయకరావుపేట, నర్సీపట్నం అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు మలపురెడ్డి కోటేశ్వరరావు, తనకాల అనంతరావు, పడాల కొండలరావు, మారుతి చక్రవర్తి, కె.చినబాబుతో పాటు కాంగ్రెస్ నాయకులు కత్తెర శ్రీధర్, కాళ్ల సత్యనారాయణ, బోయిన భానుమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మె



నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

కొత్తూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మె మంగళవారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అనకాపల్లిని డీసీఎంఎస్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్ద వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేశారు. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సీహెచ్‌వోల ప్రతినిధులు జి.భవానీ, యమున, అశ్విని, కళ్యాణి, ఆర్.అప్పలనాయుడు, స్వామి తదితరులు కోరారు.

వచ్చే నెల నాలుగున ఎలమంచిలిలో పాటల పోటీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ల ప్రతినిధులు

తుమ్మపాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : సినీ గాయకుడు, పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా జూన్ నాలుగో తేదీన ఎలమంచిలి గురప్ప కల్యాణ మండపంలో సినీ పాటల పోటీ నిర్వహించనున్నామని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం అనకాపల్లిలో ఆవిష్కరించి మాట్లాడారు. ఔత్సాహిక గాయనీ గాయకులు పాల్గొనాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మత్సర్తి రామారావు, ఆడారి అప్పారావు, వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే కొణతాల సమీక్ష

» విద్యుత్, ప్రకృతి వ్యవసాయంపై సూచనలు, సలహాలు



ప్రకృతి వ్యవసాయం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అనకాపల్లి పట్టణం రింగురోడ్డులో గల జనసేన కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉపయోగపడే ఏజీఎల్ సర్వీసుల్లో విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని, వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, ఈఈ శేఖర్ పాల్గొన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న, సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన పెంచి, ఈ దిశగా సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు.

అభయాంజనేయుడ్ని దర్శించుకున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా దంపతులు



స్వామిని దర్శించుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా దంపతులు

అనకాపల్లి టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణాన్ని ఆనుకొని ఉన్న శారదానది ఒడ్డున గల చాలీసా అభయాంజనేయ స్వామిని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, విశాఖపట్నం జిల్లా జడ్జి నిఖిత సింగర్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆశీర్వదించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. తొలుత ఆలయానికి వచ్చిన వీరికి కమిటీ ప్రతినిధులు అజయ్, కరణం నూకునాయుడు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు.

నిరుపేదలందరికీ సంక్షేమ ఫలాలు : డీడీవో



పంచాయతీల వారీగా సమస్యలు అడిగి తెలుసుకుంటున డీడీవో మంజులా వాణి

కశింకోట, మే 20 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అనకాపల్లి డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో) ఎస్.మంజులావాణి సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా సర్వే నిర్వహించాలన్నారు. ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రధానంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర అందరి లక్ష్యం కావాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వంగలపూడి రవికుమార్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెం హత్య కేసులో ఏడుగురి అరెస్టు

» వివరాలు వెల్లడించిన పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్, వెనుక వరుసలో నిందితులు

పరవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన హత్యకు సంబంధించి ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పరవాడ డీఎస్పీ వల్లెం విష్ణుస్వరూప్ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి బంగార్రాజు వద్ద చింతకాయల ఎర్రయ్య రూ. 63వేలు అప్పుగా తీసుకున్నాడు. రూ.45వేలు చెల్లించిన ఎర్రయ్య మిగతా రూ. 18వేలు బాకీ తీర్చలేదు. ఈ క్రమంలో ఈ నెల 18న రాత్రి బాకీ విషయమై బంగార్రాజు .... ఎర్రయ్యకు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఎర్రయ్యకు వరుసకు మేనల్లుడైన కొవిరి కామేశ్ అలియాస్ కామరాజు కత్తితో బంగార్రాజుపై దాడి చేసి హతమార్చాడు. ఈ దాడిలో కామరాజు తమ్ముడు శివాజీ, మిగతా కుటుంబసభ్యులు సహకరించారు. హత్య అనంతరం వారంతా అక్కడి నుంచి పరారయ్యారు. ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌ల నుంచి సిబ్బంది ఐదు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం నిందితులందరినీ అచ్యుతాపురం మండలం మడుతూరు వద్ద పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కొవిరి కామేశ్ అలియాస్ కామరాజుతో పాటు కొవిరి శివాజీ, కొవిరి ఆర్మీ ముత్యాలు, చింతకాయల ఎర్రయ్య, కొవిరి ముత్యాలు, వాసుపల్లి ప్రవీణ్‌కుమార్, కొవిరి ముత్యాలమ్మగా గుర్తించారు. హత్యకు ఉపయోగించిన కత్తి, ఐరన్‌రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన 36 గంటల్లో నిందితులను పట్టుకున్నారు. నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్ విధించారు. హత్య నేపథ్యంలో ముత్యాలమ్మపాలెంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. వ్యక్తిగత కారణాలతో జరిగిన ఈ హత్యను ఆసరాగా చేసుకొని గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐలు బి.కృష్ణారావు, వి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

'వ్యవసాయ పనులకు వర్షాలు అనుకూలం'



వాతావరణ ఆధారిత వ్యవసాయంపై సమావేశంలో పాల్గొన్న అధికారులు

అనకాపల్లి అగ్రికల్చర్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాగల ఐదు రోజుల్లో అనకాపల్లి జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఇన్‌చార్జి పి.వి.కె.జగన్నాథరావు తెలిపారు. వాతావరణ ఆధారిత వ్యవసాయంపై ఆర్ఏఆర్ఎస్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్ష సూచన ఉన్నందున ముందస్తు ఖరీఫ్ పంటగా నువ్వులను వేసుకునే రైతులు వాతావరణ పరిస్థితులు గమనించి విత్తుకోవాలన్నారు. నువ్వులలో అధిక దిగుబడినిచ్చే వైఎల్ఎం 17, వైఎల్ఎం 66 వంటి రకాలను ఎంపిక చేసుకొని ఈ నెలాఖరులోపు ఎకరానికి 2 కిలోల చొప్పున విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని సూచించారు. రాగల వర్షాన్ని వినియోగించుకుని నేలను దున్ని, ఖరీఫ్ పైరులైన సజ్జ, కొర్ర అపరాలు, వేరుశనగ వంటి పంటలను వేసుకోవడానికి నేలను తయారు చేసుకోవాలన్నారు. ఖరీఫ్‌కి అనువైన వరి రకాలైన ఆర్‌జీఎల్ 2537, ఎంటీయూ 1310, ఎంటీయూ 1321, ఎంటీయూ 1232, ఎంటీయూ 1262, ఎంటీయూ 1061 వంటి రకాలను రైతులు ఎంపిక చేసుకొని విత్తనాన్ని సేకరించుకోవాలన్నారు. వర్షసూచన ఉన్నందున అరటి, మామిడి, బొప్పాయి వంటి పండ్ల తోటల్లో పక్వానికి వచ్చిన ఫలసాయాన్ని కోసి మార్కెట్‌కు తరలించాలన్నారు. డాక్టర్ వి.గౌరి, డాక్టర్ బి.భవానీ, డాక్టర్ ఎ.శిరీషా, డాక్టర్ వి.చంద్రశేఖర్, డాక్టర్ ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు అసంపూర్తి కల్యాణ మండపం

» అంతకాపల్లిలో 19 ఏళ్లుగా ముందుకు సాగని పనులు



శిథిలావస్థకు చేరిన అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపం

సబ్బవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతకాపల్లి గ్రామంలో 19 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపం ఇప్పుడు శిథిలావస్థకు చేరింది. దీనిని ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్మాణం పూర్తికాక అసంపూర్తిగా ఉండిపోయింది. 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి పరవాడ ఎమ్మెల్యే గండి బాబ్జీ అంతకాపల్లిలో కల్యాణ మండపం నిర్మాణానికి సుమారు రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. కల్యాణ మండపం శ్లాబ్ పనులు పూర్తయిన తరువాత నిధులు విడుదలకాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. అప్పటి నుంచి కల్యాణ మండపం పనులు ముందుకు సాగలేదు. ప్రభుత్వాలు మారినా దీనికి మోక్షం కలగలేదు. ఇప్పుడు ఇది శిథిలావస్థకు చేరింది.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని వివిధ సంఘాల ఆందోళన



అనకాపల్లిలోని ఆర్ఏఆర్ఎస్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ఆందోళనలు చేపట్టారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం, జీవీఎంసీ జోనల్ కార్యాలయం, ఆర్టీసీ డిపోల వద్ద కార్మికులు ఈ ఆందోళనలు జరిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు, గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం తగదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరు వాత పెట్టుబడిదారులకు అనుకూలంగా ఈ లేబర్‌కోడ్స్‌ను తీసుకువచ్చిందని ఆరోపించారు. తక్షణమే వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జూలై తొమ్మిదవ తేదీన చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పరమేశ్వరరావు, నందీశ్వరరావు, త్రిమూర్తులు, సత్యనారాయణ, శ్రీను, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట : నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ, ప్రజా సంఘాల ప్రతినిధులు దాకారపు శ్రీనివాసరావు, టి.తనూజ, కె.శాంతి, ఎం.శ్రీదేవి, సత్తిబాబు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారంతా కలిసి కశింకోటలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులకు నష్టం కలిగేలా లేబర్ కోడ్‌లను తీసుకు వస్తుందని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు శివలక్ష్మి, ఎస్.కె.రెహమాన్, జె.సత్యం, కుమార్, జి.సత్తిబాబు, నారాయణమ్మ, ఆశ, అంగన్‌వాడీ, ఎండీఎం, పంచాయతీ, ముఠా, బిల్డింగ్, స్కూల్ శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.



కశింకోటలో తహసీల్దార్ వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పరవాడలో...

పరవాడ : కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ కింద మార్పు చేసి పరిశ్రమల యాజమాన్యాలకు మేలు చేకూర్చేలా వ్యవహరించడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. లంకెలపాలెం నుంచి పరవాడకు వెళ్లే ప్రధాన రహదారిలో మంగళవారం కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, కరణం వెంకటరావు, నాగేశ్వరరావు, వెంకటస్వామి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మర్లమ్మతల్లి మారువారం పండుగ



అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు

సబ్బవరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంలో మర్లమ్మతల్లి మారువారం పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పసుపు కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైసీపీ నాయకులు గండి రవికుమార్, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, ఉపసర్పంచ్ మండల లక్ష్మణ, బుజ్జి, నాగభూషణం, శివ, చిత్రాడ శ్రీను, నాగేంద్ర, యడ్ల నాయుడు, ఉత్సవ కమిటీ పెద్దలు అమ్మవారిని దర్శించుకున్నారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



జన్మదిన కేక్ కట్ చేస్తున్న అభిమానులు

అనకాపల్లి టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను పట్టణంలో మంగళవారం ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. రింగు రోడ్డు జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ గౌరవాధ్యక్షుడు పొలిమేర నాయుడు, ఎన్టీఆర్ సేవా సమితి సభ్యులు సూరిశెట్టి రమణకుమార్, బుద్ధ జగదీశ్ గాంధీ, అల్లు సురేష్, మద్దాల భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో



క్లాత్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కశింకోట, మే 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఇక్కడ ఉచితంగా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీవో వి.వి.రవికుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. అర్హులంతా వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

నేడు పంచముఖ ఆంజనేయ ఆలయ ప్రారంభం



విద్యుత్ కాంతుల్లో నూతనంగా నిర్మించిన ఆలయం

పరవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలోని మెట్రోకెమ్ ఫార్మా కంపెనీ యాజమాన్యం నూతనంగా నిర్మించిన పంచముఖ ఆంజనేయ ఆలయాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. ఉదయం 8.51 గంటలకు సంస్థ ఎండీ ఎస్.వెంకటేశ్వరరావు స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఇందుకు సంబం.ధించి నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. విశేష పూజలతో పాటు హోమాలు జరపనున్నామని హెచ్ఆర్ తేజ తెలిపారు.

నేడు ఇరువాడలో మినీ మహానాడు

సబ్బవరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మినీ మహానాడును బుధవారం మండలంలోని ఇరువాడలో గల జీఎస్ కన్వెన్షన్స్‌లో నిర్వహించనున్నామని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా మధ్యాహ్నం మూడు గంటలకు సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో తిరంగా ర్యాలీ జరుపుతామన్నారు. అనంతరం నాలుగు గంటలకు మినీ మహానాడు సభ ప్రారంభం కానుందని వివరించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గల సర్పంచుల, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాల్సిందిగా ఆయన కోరారు.

ప్రకృతి సేవకులు

గ్రీన్ పాప్స్ ఆర్గనైజేషన్ పేరుతో విభిన్న కార్యక్రమాల నిర్వహణ

- వన్యప్రాణులు, తీర ప్రాంత పరిరక్షణకు కృషి
- ఆరేళ్లుగా విభిన్న కార్యక్రమాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్న యువత

(విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి):

ప్రకృతి బాగుంటే అందరూ బాగుంటారు. సృష్టిలోని ప్రతి జీవికి ఆనందంగా జీవించే హక్కు ఉంది. అందుకు అనుగుణమైన వాతావరణాన్ని కల్పించే బాధ్యత ప్రతిఒక్కరిదీ. ఇదే స్లోగన్‌తో ముందుకు సాగుతోంది గ్రీన్ పాప్స్ సంస్థ. వన్య ప్రాణులు, తీర ప్రాంత పరిరక్షణతోపాటు మత్స్యకార మహిళలకు ఉపాధిని కల్పించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు ఈ సంస్థకు చెందిన సభ్యులు. గత కొన్నాళ్లుగా విభిన్నమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ వన్యప్రాణులు, తీర ప్రాంత రక్షణకు విశేషంగా కృషి చేస్తున్న సంస్థ కార్యక్రమాలపై ప్రత్యేక కథనం.


తీరంలోని సందర్శకులకు జీవరాశుల గురించి తెలియజేస్తున్న సభ్యులు

నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో విభిన్న జాతులకు చెందిన పక్షులు, జీవరాశులు, జంతువులు వంటివెన్నో ఉన్నాయి. వీటిలో అనేక జీవరాశులకు ప్రమాదం కూడా పొంచి ఉంటోంది. ఆ ప్రమాదాల పట్ల ప్రజలకు అవగాహన కలిగించడం ద్వారా ఆయా జీవరాశులకు ఇబ్బందులు కలగకుండా చేయాలని భావించారు నగరానికి చెందిన పొట్లూరి అనిల్ చౌదరి. అదే సమయంలో తీరాన్ని కూడా వ్యర్థాలమయం చేస్తూ అనేక జీవరాశులు ప్రమాదంలో పడేటట్లు చేస్తుండడాన్ని ఆయన గుర్తించారు. వీటిపట్ల కూడా ప్రజల్లో అవగాహన కల్పించి వాటి పరిరక్షణకు కృషి చేయాలని భావించిన ఆయన 2019లో గ్రీన్ పాప్ పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

పక్షుల గురించి తెలియజేస్తూ..

నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో విభిన్న జాతులకు చెందిన పక్షులు ఉన్నాయి. వీటిలో అరుదైన పక్షులెన్నో ఉన్నాయి. ఇందులో పావురాలు, చిలుకలు, కొంగలు వంటి సాధారణ పక్షులే కాకుండా ఏషియన్ ప్యారడైజ్ వంటి విభిన్న జాతులకు చెందినవి కూడా ఉన్నాయి. అయితే వీటి గురించి చాలామందికి తెలియదు. కొన్నిచోట్ల ప్రమాదాల్లో ఇటువంటివి ఉన్నప్పుడు ఎవరూ పట్టించుకోరు. వాటి గురించి సమాచారాన్ని అందిస్తే వాటిని రక్షించడంతోపాటు వాటిని మళ్లీ సాధారణ స్థితికి వచ్చేంతవరకు వాటి బాధ్యతను చూస్తుంటారు. అలాగే అవి తీసుకునే ఆహారం గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం ఎప్పటికప్పుడు బర్డ్ వాచింగ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతుండడంతో పాటు రెస్క్యూ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు.

తెగిన వలలతో మహిళలకు ఉపాధి

మత్స్యకారులు వినియోగించే వలలు కొన్నేళ్ల తరువాత తెగిపోతుంటాయి. వాటిని చాలామంది మత్స్యకారులు సంద్రంలో పడేస్తుంటారు. ఇలా చేయడం వల్ల సముద్రంలోని తాబేళ్ల వంటి జీవరాశులు వాటిలో చిక్కుకుని ప్రాణాలను కోల్పోతుంటాయి. ఇటువంటి ప్రమాదాలను నియంత్రించేందుకు మత్స్యకారులకు తెగిపోయిన, పాడైన వలలను మళ్లీ ఒడ్డుకు తెచ్చేలా వారికి అవగాహన కల్పిస్తున్నారు. అయితే వలలను వెనక్కి తీసుకురావడం వల్ల మత్స్యకారులకు ఏమీ ఉపయోగం ఉండదు కాబట్టి, చాలామంది ఆసక్తి చూపించరు. అయితే వెనక్కి తేవడం వల్ల ఉపయోగం ఉంటే మాత్రం వారు తప్పకుండా తీసుకువస్తారు. అందుకే సరిగ్గా దీనిపైనే గ్రీన్ పాప్స్ సంస్థ దృష్టి సారించింది. తెగిపోయిన వలలను రీసైక్లింగ్, అప్ సైక్లింగ్ చేయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఆయా వలలతో మత్స్యకార మహిళలు కీ చైన్స్, ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులు తయారుచేసేలా వారికి శిక్షణ ఇప్పించారు. అలా మహిళలు తయారుచేసిన వస్తువులను సంస్థే కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా చేయూతను అందిస్తోంది. ఒకవైపు మత్స్యకార మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకారాన్ని అందించడంతో పాటు సముద్రంలోని జీవరాశుల ప్రాణాలను కాపాడేలా చేస్తోంది.

సీతాకోక చిలుకల పరిరక్షణకు..

నగర పరిధిలోని అనేకచోట్ల విభిన్న జాతులకు చెందిన వేలాది మొక్కలు ఉన్నాయి. వీటికి ఆకర్షితులై అనేక జాతులకు చెందిన సీతాకోక చిలుకలు వస్తుంటాయి. అయితే చాలామందికి ఆయా మొక్కల గురించి తెలియక పాడుచేస్తుంటారు. దీనివల్ల విభిన్న జాతులకు చెందిన సీతాకోక చిలుకల ఆహారానికి, ఇతర ప్రక్రియలకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్టు ఈ సంస్థ గుర్తించింది. దీంతో ఆయా మొక్కలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఆయా మొక్కలను తొలగించడం వల్ల విభిన్న జాతులకు చెందిన సీతాకోకచిలుకలు ప్రాణాలు కోల్పోయేలా చేస్తున్నారనే విషయాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. వీటిలో అరుదైన కామన్ క్రో బటర్‌ఫ్లై వంటివి ఉన్నట్టు చెబుతున్నారు. సుమారు 120 రకాల సీతాకోకచిలుకలు ఉండగా, వీటికి అవసరమైన ఆహారం, ఇతర ప్రక్రియలకు అవసరమయ్యే 380 రకాల మొక్కలు ఉన్నాయి. వీటిలో చాలావరకు మొక్కల గురించి ప్రజలకు అవగాహన లేక ఎక్కడికక్కడే కొట్టేస్తున్నారు. అలా కొట్టకుండా అవగాహన కల్పిస్తుండడంతో పాటు ప్రత్యేకంగా బయో డైవర్సిటీ వాక్ వంటివి చేపడుతున్నారు.

సాగరంలో వ్యర్థాలు వేయవద్దంటూ..

నగర పరిధిలోని అనేక ప్రాంతాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో చేరుతున్నాయి. దీనివల్ల సంద్రంలోని అనేక జీవరాశులు ప్రాణాలను కోల్పోతున్నాయి. అదే సమయంలో కొన్నిసార్లు సముద్రం ముందుకు వచ్చి మళ్లీ అనూహ్యంగా వెనక్కి వెళుతుంటుంది. ఇలా కొన్ని మీటర్లు సముద్రం వెనక్కి వెళ్లినప్పుడు అనేక జీవరాశులు తీరానికి కొట్టుకొస్తుంటాయి. ఇందులో ఆక్టోపస్, బ్రిటల్ స్టార్స్ స్టార్ ఫిష్ వంటివి ఉంటాయి. ఇవన్నీ తీరానికి వచ్చినప్పుడు వ్యర్థాలుంటే వాటిలో చిక్కుకుని మృత్యువాత పడుతుంటాయి. అవి ప్రాణాలు కోల్పోకుండా ఉండాలంటే వ్యర్థాలు వేయకూడదని ప్రజలకు వివరిస్తున్నారు. కాగా పొట్లూరి అనిల్ చౌదరి ఏర్పాటు చేసిన ఈ సంస్థలో వలంటీర్లుగా నమిత, సత్యనారాయణ, వివేక్, దివ్యతోపాటు ఎంతోమంది పనిచేస్తున్నారు.

జీవరాశులను పరిరక్షించేందుకే..



ప్రజలకు తెలియకుండానే అనేక జీవరాశులకు నష్టాన్ని చేకూరుస్తున్నారు. అదే తెలిస్తే ఎవరూ అలా చేయరు. ఈ ఒక్క పాయింట్‌పైనే దృష్టి సారించి గ్రీన్స్ పాప్స్‌ను ఏర్పాటు చేశాం. పక్షులు, జంతువులు, సముద్ర జీవరాశులను పరిరక్షిం చేందుకు విభిన్న కార్యక్రమాలను ఆరేళ్లగా నిర్వహిస్తున్నాం. ఎంతోమంది వలంటీర్లు తమతో భాగస్వాములవుతున్నారు. ప్రజలు కూడా తాము చెబుతున్న అంశాలను ఆసక్తిగా వింటూ ఆచరిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను అమలు చేసే దిశగా సంస్థను ముందుకు తీసుకువెళతాం.

- పొట్లూరి అనిల్ చౌదరి, గ్రీన్ పాప్స్ వ్యవస్థాపకుడు

---

130 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

- కారు సీజ్.. ముగ్గురు పరారీ

చీడికాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతం నుంచి తర లిస్తున్న 130 కిలోల గంజాయిని పట్టుకొని కారు డ్రైవర్‌ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక విలేకరులకు ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కె.కోటపాడు సీఐ పైడంనాయుడుకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ సతీష్, పోలీస్ సిబ్బంది ఖండివరం శివారు ప్రాంతంలో మంగళవారం ఉదయం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం నుంచి వస్తున్న కారుని ఆపి తనిఖీ చేయగా.. అందులో 130 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకొని చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ కాశీతేజని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ సతీష్ తెలిపారు. కారుని సీజ్ చేశామన్నారు. కారు ముందు పైలెట్‌లుగా ఉన్న ముగ్గురు నిందితులు తప్పించుకొని పారిపోయారన్నారు. వీరిని త్వరలో పట్టుకుంటామన్నారు. ఈ గంజాయి విలువ రూ.6.5లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

వివిధ కేసుల్లో చోరీ సొత్తు స్వాధీనం

- నలుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ కేసుల్లో చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశామని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయా చోరీ కేసులకు సంబంధించిన వివరాలను ఆయన మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన ఐదు చోరీ కేసుల్లో ఏడున్నర తులాల బంగారం, 28 తులాల వెండి, రూ.1500లు నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక నిందితుడిని అరెస్టు చేశామన్నారు. అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ మూడో తేదీన, అలాగే ఈ నెల మూడో తేదీన చోరీలు జరిగినట్టు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ రెండు చోట్ల జరిగిన చోరీల్లో 352 గ్రాముల బంగారం, రూ.1500 నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక నిందితుడిని అరెస్టు చేశామన్నారు. చోడవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఏడాది మార్చి 26వ తేదీన ఒక ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించి 34.4 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. సబ్బవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో గత సంవత్సరం నవంబరు 23వ తేదీన జరిగిన చోరీకి సంబంధించి 40.37 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అయితే అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్, చోడవరం, సబ్బవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినది ఒకే వ్యక్తి అని ఎస్పీ తెలిపారు. నిందితుడు అనకాపల్లి జిల్లా ముత్యాలమ్మపాలెం గ్రామం దేవరాపల్లి మండలానికి చెందినవాడని చెప్పారు. చోరీ సొత్తును అనకాపల్లిలో విక్రయించడానికి వెంకన్నపాలెం మీదుగా అనకాపల్లికి వస్తుండగా మంగళవారం అనకాపల్లి రూరల్ పోలీసులు మార్టూరు జంక్షన్ వద్ద అతనిని పట్టుకున్నారని తెలిపారు.

నర్సీపట్నంలో ముగ్గురి అరెస్టు

నర్సీపట్నం పట్టణ పరిధిలోని ఈ నెల 16న శారదానగర్‌లో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధ మహిళ ఇంట్లోకి చొరబడి ఆమెపై దాడి చేసి ఆభరణాలను అపహరించిన ముగ్గురిని మంగళవారం అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. వారి నుంచి పదింపావు తులాల బంగారం, 19.370 తులాల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయా కేసుల్లో నిందితులను పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ (క్రైమ్) ఎల్.మోహనరావు, నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు, అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహనరావు, సీఐలు జి.అశోక్‌కుమార్, జి.గోవిందరావు, ఎస్ఐ జి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామశాస్త్రి విగ్రహం ఏర్పాటుకు చర్యలు

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ
- రామజోగయ్యశాస్త్రికి సిరివెన్నెల స్మారక పురస్కారం ప్రదానం

అనకాపల్లి టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లికి వన్నె తెచ్చిన గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి విగ్రహాన్ని అనకాపల్లి ముఖ్య కూడలిలో ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. మంగళవారం రాత్రి నూకాంబిక ఆలయం రోడ్డులోని ఒక ఫంక్షన్‌హాల్‌లో సీతారామశాస్త్రి 70వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతారామశాస్త్రి చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సినీ గేయ రచయిత రామజోగయ్యశాస్త్రికి సిరివెన్నెల సీతారామశాస్త్రి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కొణతాల మాట్లాడుతూ తానా ప్రతినిధుల సహకారంతో రూ.20 లక్షలతో సీతారామశాస్త్రి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రముఖ రచయిత యర్రాప్రగడ రామకృష్ణ.. సీతారామశాస్త్రి పాటల రూపంలో అందించిన సాహిత్యాన్ని వివరించారు. సీతారామశాస్త్రి సోదరుడు శ్రీరామశాస్త్రి.. సీతారామశాస్త్రిపై రచించిన పుస్తకాన్ని ఎమ్మెల్యే కొణతాల ఆవిష్కరించారు. రామజోగయ్యశాస్త్రి మాట్లాడుతూ సిరివెన్నెల శిష్యునిగా ఉండడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో సత్యారావు, వెంకటశాస్త్రి, గంటి రవికుమార్, కొడుకుల శ్రీకాంత్, దూలం ప్రసాద్, సీతారామశాస్త్రి సతీమణి పద్మావతి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

పెంటకోట బీచ్‌లో గల్లంతైన ఇద్దరు యువకులు మృతి

- తెల్లవారుజామున ఒడ్డుకు కొట్టుకు వచ్చిన మృతదేహాలు


పిల్లి అభిలాష్, గంపల తరీశ్ మృతదేహాలు

పాయకరావుపేట/రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంటకోట తీరంలో గల్లంతైన ఇద్దరు యువకులు మృతిచెందారు. దీంతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మంగళవారం తెల్లవారుజామున తీరానికి కొట్టుకు వచ్చిన మృతదేహాలను పోలీసులు నక్కపల్లి ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. సోమవారం మండలంలో పెంటకోట బీచ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి సముద్ర స్నానానికి వెళ్లిన పాయకరావుపేటలోని పాత హరిజనవాడకు చెందిన గంపల తరీష్(17), అతని దగ్గర బంధువు అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి గ్రామానికి చెందిన పిల్లి అభిలాష్(19) ప్రమాదవశాత్తూ సముద్రంలో కొట్టుకుపోయి గల్లంతైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న పాయకరావుపేట పోలీసులు, పెంటకోట మెరైన్ పోలీసులు గజఈతగాళ్లతో ఎంత గాలించినా గల్లంతైన యువకుల జాడ తెలియలేదు. మంగళవారం తెల్లవారుజామున పెంటకోట సముద్ర తీరానికి కిలోమీటరు దూరానికి యువకుల మృతదేహాలు కొట్టుకురావడంతో గుర్తించిన పోలీసులు మృతదేహాలను ఒడ్డుకి చేర్చి నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం

సోమవారం పెంటకోట సముద్రతీరంలో గల్లంతైన ఇద్దరు యువకులు విగతజీవులై లభించడంతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను పాయకరావుపేటకు తరలించగా కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు. చేతికి అందివచ్చిన తమ కుమారులు అర్ధంతరంగా మృతిచెందడంతో గుండెలు అవిసేలా మృతుల తల్లిదండ్రులు విలపించారు. మృతుల్లో గంపల తరీష్(17) పాయకరావుపేటకు చెందిన గంపల చెల్లారావు, వీరలక్ష్మిలకు మొదటి సంతానం కాగా, తరీష్‌కి ఒక తమ్ముడు ఉన్నాడు. తండ్రి చెల్లారావు పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుండగా, మృతుడు తరీష్ ఇంటర్ ఫస్ట్‌ఇయర్ చదువుతూనే తన తండ్రికి సహాయకారిగా బస్సు క్లీనర్‌గా తరచూ పనిచేసేవాడని మృతుడి బంధువులు తెలిపారు. అదేవిధంగా మరో మృతుడు పిల్లి అభిలాష్(19) తండ్రి రమేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి నుంచి కుటుంబంతో హైదరాబాద్ వెళ్లి అపార్టుమెంట్‌లో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా, మృతుడు అభిలాష్ డిగ్రీ ఫస్ట్‌ఇయర్ చదువుతున్నాడు. కాగా మృతుడు అభిలాష్‌కి సోదరి ఉంది.

డిప్యూటీ మేయర్‌గా గోవిందరాజు ఏకగ్రీవం

... 5వ పేజీ తరువాయి

ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. డిప్యూటీ మేయర్ పదవికి పోటీ చేయాలనుకునే అభ్యర్థిని ఒకరు ప్రతిపాదిస్తే, మరొకరు బలపరచాల్సి ఉంటుందని, ఇద్దరు కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే ఎన్నిక జరుపుతామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు పేరును పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రతిపాదించగా, ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు బలపరిచారు. ఇంకెవరైనా పోటీలో ఉన్నారా? అని జాయింట్ కలెక్టర్ అడగ్గా...సభ్యుల నుంచి సమాధానం లేకపోవడంతో గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. అనంతరం డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్టు ధ్రువీకరణ పత్రాన్ని దల్లిగోవిందరాజుకు అందజేశారు.

నష్టపరిహారంపై తేల్చండి

... 5వ పేజీ తరువాయి

జరగదన్నారు. రైతుల అభీష్టంతోనే సుజల స్రవంతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు చేపడతామని చెప్పారు. ఉన్నతాధికారుల సూచన మేరకే ముందుగా ప్రభుత్వ భూములను గుర్తించేందుకు ఈ సర్వే చేస్తున్నామని ఆయన తెలిపారు. అయితే దీనికి రైతులు అంగీకరించకపోవడంతో తహసీల్దార్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది వెనుతిరిగారు.


తహసీల్దార్ వెంకటరమణతో వాగ్వాదానికి దిగిన రైతులు

ఆహార భద్రతకు తూట్లు

... 5వ పేజీ తరువాయి

విక్రయిస్తున్నారు. ఆహార పదార్థాలు తయారు చేసే శాలలలో వంట పాత్రలు, పరిసరాలు చూస్తే దారుణంగా ఉన్నాయని తనిఖీ అధికారులు చెబుతున్నారు.

తొమ్మిది హోటళ్లపై క్రిమినల్ కేసులు

జిల్లాలో ఆహార భద్రత నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేసి ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 39 కేసులు నమోదు చేశారు. 2024-25లో వివిధ హోటళ్ల నుంచి 400 ఫుడ్ శాంపిల్స్ సేకరించి 36 కేసులు నమోదు చేశారు. ఇందులో 9 హోటళ్ల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. గత ఏడాది ఫుడ్ శాంపిల్స్ సేకరణ, కేసుల నమోదులో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

... 5వ పేజీ తరువాయి

నరేశ్, మనుమరాలు సువర్ణకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, వృద్ధురాలి మృతదేహానికి అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కాగా మృతురాలి కుమారుడు నరేశ్ విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. బంధువుల వివాహం నిమిత్తం కుటుంబ సభ్యులంతా సోమవారం రాత్రి బస్సులో వెళ్లిపోయారు. తెల్లవారుజామున నరేశ్ తన తల్లి, అక్క కుమార్తెలు, అతని కుమార్తెలతో కారులో బయలుదేరి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజామున వర్షం కురవడంతో ముందు వెళుతున్న వాహనం కనిపించకపోవడం, దీనికి తోడు లారీ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా మలుపు తిప్పడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ

ఎలమంచిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఎలమంచిలి పట్టణంలో రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయం త్రివిధ దళాల పోరాట పటిమకు, ప్రధాని నరేంద్ర మోదీ సమయస్ఫూర్తికి నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేతబూని గురవప్ప కల్యాణ మండపం నుంచి ఎల్ఐసీ రోడ్డు మీదుగా దిమిలి రోడ్డు జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేశ్, మండల, పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గెంజి శ్రీను, సీనియర్ నేతలు కొలుకులూరి విజయ్‌బాబు, కొఠారు సాంబ, జిల్లా నేతలు ఆడారి మంజు, రాజాన నారాయణమ్మ, స్థానిక నేతలు రాజాన వెంకునాయుడు, కరణం రవి, ఆడారి రమణబాబు, బొద్దపు శ్రీను, నమ్మి రమణ, ముప్పిన కృపారావు, తదితరులు పాల్గొన్నారు.

మహానాడు ప్రతినిధుల నమోదు కమిటీ కన్వీనర్‌గా చింతకాయల విజయ్



నర్సీపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం మహానాడులో ప్రతినిధుల నమోదు కమిటీ కన్వీనర్‌గా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాలయ విజయ్‌ని నియమించారు. ఈనెల 27న కడపలో మహానాడు జరుగుతున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో 12 మంది పార్టీ నాయకులతో ప్రతినిధుల నమోదు కమిటీ వేశారు.

ఏపీఐసెట్‌లో 167 మంది ఉత్తీర్ణత

అనకాపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న జరిగిన ఏపీ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఐసెట్-2025) పరీక్షల ఫలితాలను ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ మంగళవారం విడుదల చేసింది. ఈ పరీక్ష రాసేందుకు జిల్లా నుంచి 190 మంది విద్యార్థినీ విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 169 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 167 మంది ఉత్తీర్ణులయ్యారు. అనకాపల్లి పట్టణంలో కోరిబిల్లివారి వీధిలో విజయరామరాజుపేటకు చెందిన షేక్ బసీరున్నీషా 175 మార్కులతో 6వ ర్యాంకు సొంతం చేసుకుంది.